నేటి కందం-నేటికి అందం

సీ యూ ఈ టీలో పసి
ప్రాయములో భారతమున ప్రప్రథమంబౌ
స్థాయి కొరకు దేవీనా
ధీయుతయై చదివి గెలిచె తేజ మ్ముప్పన్ !!
(చాలా చిన్న వయసులోనే దేవీనా గెహ్లోట్ సీ యూ ఈ టీ లో భారత దేశం లోనే మొట్టమొదటి స్థానం సంపాదించి యువభారతికి తలమానికమై నిలిచింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

సర్ సెగలో ఓటుహక్కు
చిరకాలం భద్రమేనా
ఆధారం దొరకకుంటే
అయిపోయే ఛిద్రమేనా.
చూపకుంటే రుజువులు
చొరబాటుదారులేనా
జన్మించి దేశంలో
జీవించినా చోరులేనా

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 26-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:249 పేజీలు:6 వెల: రూ.1/-


# తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ చరిత్రలో నిలుస్తాయి: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 25:తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. ఈరోజు(గురువారం) తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించారు. కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు.

## కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు..

మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చా యని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ఖీఆూ కింద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుం దని తెలిపారు. తమకు పంచాయి తీలు వద్దని.. పరిష్కారం కావా లని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారం..

రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించకపోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## 6 నెలల్లో 33 గేట్ల పునరుద్ధరించాం: సీఎం చంద్రబాబు

రాయలసీమలోని పలు ప్రాంతాలకు సాగునీరు.. మరి కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు తుంగభద్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దేశంలో నదుల అనుసంధానం తన కలల ప్రాజెక్టు అని ఉద్ఘాటించారు. గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని పేర్కొన్నారు.

తుంగభద్ర డ్యామ్ 70 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాజెక్టు అని తెలిపారు. తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. అందరూ రైతులకూ నమస్కారాలు అంటూ సీఎం చంద్రబాబు కన్నడలో ప్రసంగించారు. ప్రాజెక్టు నిర్వహణ బాగుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతోందని చెప్పారు. 6 నెలల్లో తుంగభద్ర ప్రాజెక్టు 33 గేట్ల పునరుద్ధరించామని వివరించారు. తమిళనాడుకు నీళ్ల ఇవ్వాలని 1983లో నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. నీటి సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇవాళ ముగ్గురు సీఎంలు కలవడం చరిత్రాత్మకమని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు సమస్య ఉందని తెలిపారు. నీరు ఉంటేనే చరిత్ర, నాగరికత అని.. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని సీఎం చంద్రబాబు అభివర్ణించారు.

## ముగ్గురం సీఎంలు కలిసి చరిత్ర సృష్టిస్తాం: డీకే శివకుమార్

కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో చరిత్రాత్మక తీర్మానం చేశామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతుల కోసం తీసుకున్న నిర్ణయం ఓ చరిత్ర అని తెలిపారు.

చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, తాను చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. అందరం కలిసి సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. మూడు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తామని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు.

# వెనెజువెలా భూకంపాన్ని ముందే హెచ్చరించిన స్మార్ట్ ఫోన్లు!

న్యూ ఢిల్లీ, జూన్ 25: ప్రకృతి విపత్తులు ఎప్పుడు, ఏ రూపంలో వస్తాయో ఎవ్వరం ఊహించలేము. ముఖ్యంగా భూకంపాలు, సునామీ లాంటి ప్రకృతి విపత్తులు క్షణాల వ్యవధిలోనే పెను విధ్వంసాన్ని సృష్టిస్తాయి. అయితే, సాంకేతికత సరిగ్గా పనిచేస్తే.. కొన్ని క్షణాల ముందస్తు సమాచారమే వేలాది మంది ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఆ మాటలను వెనెజువెలాలో జరిగిన భూకంప సంఘటన నిరూపించింది.

ఈ పెను భూకంపం సంభవించడానికి కొన్ని సెకన్ల ముందే గూగుల్ పలు ఆండ్రాయిడ్ మొబైల్స్ అలర్ట్ పంపినట్లు తాజాగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన స్క్రీన్ షాట్లను నెటిజన్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. 'భూకంపం వస్తోంది.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి' అంటూ గూగుల్ పంపిన అలర్ట్ మెసేజ్ చూసి ప్రజలు వెంటనే అప్రమత్తమయ్యారు. తీవ్రమైన ప్రకంపనలు మొదలయ్యేలోపే సురక్షిత ప్రాంతాలకు చేరుకోగలిగారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఈ అలర్ట్ వచ్చినట్లు సమాచారం.

గూగుల్ భూకంపాన్ని ఎలా పసిగట్టిందంటే..

గూగుల్ సంస్థ భూకంపం వస్తుందని ముందుగా జోస్యం చెప్పలేదు. కేవలం భూమి పొరల్లో మొదలైన తొలి ప్రకంపనల సంకేతాలను అత్యంత వేగంగా గుర్తించి.. ఆ ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేసింది. గూగుల్ రూపొందించిన 'ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్స్ సిస్టమ్' ద్వారా ఇది సాధ్యమైంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న స్మార్ట్‌ఫోన్లలో 'మోషన్ సెన్సార్లు' (యాక్సిలెరోమీటర్లు) ఉంటాయి. భూమిలో వచ్చే అతి సూక్ష్మమైన కదలికలను కూడా ఇవి గుర్తిస్తాయి. ఒకే ప్రాంతంలో వేలాది ఫోన్లు ఇలాంటి కదలికలను ఒకేసారి నమోదు చేసినప్పుడు, గూగుల్ క్లౌడ్ నెట్‌వర్క్ దానిని భూకంపంగా గుర్తించి, వెంటనే ఆ ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు పంపుతుంది.

రెండు రకాల అలర్ట్‌లు..

భూకంప తీవ్రతను అంచనా వేసినదాని బట్టి.. స్మార్ట్ ఫోన్లు రెండు రకాల హెచ్చరికలు ఇస్తుంటాయి.

ఒకటి 'బి అవేర్ అలర్ట్'. ఇది తక్కువ తీవ్రతతో ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఇచ్చే సంకేతం. ఇక రెండోది 'టేక్ యాక్షన్ అలర్ట్'. మధ్యస్త, తీవ్ర స్థాయి భూకంపాల సమయంలో దీనిని జారీ చేస్తుంటుంది. దీన్ని టచ్ చేయగా.. భూకంపం వచ్చే అవకాశం ఉన్న పరిధిని చూపిస్తుంది. దీంతో పాటు విపత్తు సమయంలో సురక్షితంగా ఎలా బయట పడాలో తెలిపే కొన్ని సూచనలు, సలహాలు ఇస్తుంది.

# వెనిజువెలాలో 40 సెకన్ల తేడాలో రెండు భూకంపాలు..

# 32 మంది మృతి, 700 మందికి గాయాలు

న్యూ ఢిల్లీ, జూన్ 25: వెనిజువెలాలో ఇవాళ కేవలం నిమిషం తేడాలో రెండు సార్లు భారీ భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండు సార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది.

డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది.

# రైతులెవరూ భయపడొద్దు.. అందరికీ యూరియా అందిస్తాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జూన్ 25: జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు(గురువారం) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని చెప్పుకొచ్చారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుకు రైతుభరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు.

భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు.

ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు.

రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఐఆర్ పై దుష్ప్రచారం మానుకోవాలి

**-రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నమోదు చేస్తున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ పై రాష్ట్ర మంత్రి కె విశ్వాసం లేకపోతే ఎలా ?**

**-..బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**



కరీంనగర్, జూన్ 25:(నేటినిజం ప్రతినిధి) చొప్పదండి నియోజకవర్గం లో నేడు బూత్ లెవల్ అధికారులు ఓటర్ల గృహాలు సందర్శించి వారికి ఎస్ఐఆర్ ఫారంలు అందిస్తూ అవగాహన కల్పించారు. చొప్పదండి మండలం రాగంపేట గ్రామంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగంపేట తాజా మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యుల యొక్క ఎస్ఐఆర్ ఫారంలు నింపి అధికారులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఐఆర్ వల్ల ఓట్లు పోతాయని ఇటీవల ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు ఎస్ ఐ ఆర్ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటూ ఉంటే కేవలం బంగ్లాదేశీ రోహింగ్యాల ఓట్లు కాపాడటం కోసం కోసం పొన్నం ప్రభాకర్ చౌకబారు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు మహారాష్ట్రలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులు గవర్నర్ ను, మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఎస్ఐఆర్ మరింత పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారని చేశారు.కేరళలో డూప్లికేట్ ఓట్లు తగ్గిపోవడం వలన కాంగ్రెస్ పార్టీకి మేలు జరిగిందని శశి థరూర్ పేర్కొన్నారని సుప్రీంకోర్టు ఎస్ఐఆర్ ను సమర్థిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేసిన పిటిషన్లు కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా జరిగిన ఎస్ఐ ఆర్ లో ఏ ఒక్క అర్హుడైన ఓటర్ తన ఓటు కోల్పోయిన దాఖలా లేదని కేవలం మరణించిన వారివి, మరియు రెండు సార్లు నమోదు అయిన డూప్లికేట్ ఓట్లు మాత్రం తగ్గుతాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు.అంతేకాక ఎస్ ఐ ఆర్ లో పాల్గొనే ఎన్నికల అధికారులు బిఎల్వోలు సూపర్వైజర్లు, మండల డివిజనల్ జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని, వీరు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పని చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని మరి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నమోదు చేసే ఓట్లపైన రాష్ట్ర మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారికే విశ్వాసం లేకపోవటం విడ్డూరమని సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో చొప్పదండి బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శ్రీ పెరుక శ్రావణ్ కుమార్, గుండె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# అక్కసుతోనే అడ్డగోలు మాటలు..

హైదరాబాద్, జూన్ 25: తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇందిరాగాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

# ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.11 లక్షల విరాళం

తిరుపతి, జూన్ 25: శ్రీవారి భక్తులకు నిత్యం ఉచితంగా అన్నప్రసాద సేవలను అందిస్తున్న టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు కు గురువారం రూ.11 లక్షల విరాళం అందింది. బెంగుళూరుకు చెందిన హైషాని ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందించింది.

ఈ మేరకు విరాళం డీడీని తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరికి సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల వేంకటేశ్వర సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతుంది . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి . టోకెన్లు లేని భక్తులకు12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. స్వామివారిని బుధవారం 70,139 మంది భక్తులు దర్శించుకోగా 34,940 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.63 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

# ప్రధాని మోదీతో అమెజాన్ సీఈవో భేటీ.. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు



న్యూ ఢిల్లీ, జూన్ 25:ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ .. భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్రమోదీ తో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టంచేసింది.

భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దాంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది.

తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొన్నది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టామని, అప్పటి నుంచి ఈ-కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నామని అన్నారు. ప్రధాని మోదీ దార్శనికత అయిన 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతామని స్పష్టంచేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది.

గత కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈ-కామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని అమెజాన్ కంపెనీ వివరించింది. అలాగే 10 మిలియన్ల భారతీయులకు క్లౌడ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది.

భవిష్యత్తులోనూ భారత ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతుల వృద్ధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తామని అమెజాన్ పేర్కొన్నది.

రానున్న కాలంలో 3.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇవ్వడం, 80 బిలియన్ డాలర్ల సంచిత ఎగుమతులు సాధించడం, 15 మిలియన్ల చిన్న వ్యాపారాలకు ఏఐ ప్రయోజనాలు అందించడం, 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ విద్యను అందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు అమెజాన్ వెల్లడించింది.

# మానవీయతకు మచ్చలుగా చిత్రహింసల ఘటనలు

## (26 జూన్ "ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం" సందర్భంగా)

చిటికెడు రుణం కోసం వెట్టిచాకిరీ దురాచారాలు, బాల కార్మికుల శ్రమను దోచే సంపన్న కుసంస్కారులు, ఆలి నోట్‌లో గుడ్డలు కుక్కి చిత్రహింసలు చేస్తున్న మనసులేని భర్తలు, దినదినం అమానవీయ చిత్రహింసలకు గురవుతున్న అభాగ్యులు ఎందరో నిశ్శబ్దంగా రోధిస్తున్నారు, ఓదార్పుకి ఆమెడ దూరం అవుతున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, సంక్షోభాలు, తీవ్ర విపత్తుల నడుమ మిలియన్ల కొద్ది ప్రజలు ఇప్పుడు కూడా చిత్రహింసలను అనుభవించడం కొనసాగుతున్న వేళ ప్రపంచ దేశాలు ప్రతి ఏట 26 జూన్‌న "ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం (యూఎన్ ఇంటర్నేషనల్ డే ఇన్ సపోర్ట్ ఆఫ్ విక్టిమ్స్ టార్చర్)" పాటించడం ఆనవాయితీగా మారింది. సరైన కారణం లేకుండా అమానవీయంగా, ఉద్దేశ పూర్వకంగా హింసించడం లేదా బాధ పెట్ట డాన్ని 'టార్చర్' లేదా 'చిత్రహింస'గా నిర్వచిస్తారు.

### ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం-2026 ఇతివృత్తం:

చిత్రహింస పెట్టడం నేరమని, మానవ హక్కులను హరించడం అమానవీయమని, చిత్రహింసలు బాధితుల కనీస జీవించే హక్కులను కాలరాస్తున్నారని, వ్యక్తిత్వ హననం జరుగుతున్నదని తెలుసుకోవాలి. నేడు కనీసం వందకు పైగా సాయుధ పోరాటాలు జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో అన్ని వయస్సుల ప్రజలు చిత్రహింసలకు గురవుతున్నారని అర్థం అవుతున్నది. ఐరాస ఏర్పాటు చేసిన 'చిత్రహింస బాధితుల స్వచ్ఛంద నిధి' ద్వారా ప్రతి ఏట కనీసం 50,000 మంది బాధితులకు న్యాయ, మానవీయ, మానసిక, వైద్య అవసరాలకు చేయూత ఇవ్వడం కొనసాగుతున్నది. స్వేచ్ఛకు దూరంగా నిర్బంధాల వలలో చిక్కుకున్న వారు, పిల్లలు-కౌమార యువత, శరణార్థులు, వలసదారులు, ఆదివాసీ జాతులు, లౌంగిక - లింగ ఆధార హింస బాధితులు లాంటి మిలియన్ల అభాగ్యులు నేడు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అల్పాదాయ దేశాల్లో చిత్రహింసలు కొనసాగుతున్నాయి. ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం-2026 ఇతివృత్తంగా "చిత్రహింస : మానవత్వానికి వ్యతిరేకంగా నేరం (టార్చర్ : ఏ క్రైమ్ అగెనెస్ట్ హుమానిటీ)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది.

### అల్పాదాయ దేశాల్లో అధిక చిత్రహింసల నమోదు:

చిత్రహింస బాధితులు అధికంగా శ్రీలంక, ఇరాన్, ఇరాక్, అఫ్ఘానిస్థాన్, కాంగో, సూడాన్, ఇథియోపియా, టర్కీ, సిరియా లాంటి దేశాల్లో ఉన్నట్లు వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటువంటి అభాగ్య చిత్రహింస బాధితులకు మద్దతుగా ప్రజల్లో అవగాహన పెంచడం, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం, వారికి మానవ హక్కులు కల్పించడం, సామాజిక మాద్యమాల వేదికగా బాధితుల పక్షాన గళాలు విప్పడం, బాధితుల పరిరక్షణ చట్టాలకు పదును పెట్టడం, బాధితుల జీవిత గాథలను వినిడం లాంటివి ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం వేదికగా జరగాలి. చిత్రహింస బాధితులు దీర్ఘకాలిక మానసిక సమస్యలు, ఆందోళనలు, నిరాశలు, ఒత్తిడులు, నొప్పులు, తలనొప్పి, శ్వాస ఇబ్బందులు లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని గమనించాలి.

ప్రతి ఒక్కరు కనీస గౌరవాన్ని, మర్యాదను పొందడానికి అర్హులని తెలుసుకోవాలి. ఇలాంటి చిత్రహింస బాధితులకు మద్దతుగా నిలుస్తూ, అవసర చేయూతను అందిస్తూ, స్వేచ్ఛను బహుకరిస్తూ, మానవీయతను బతికిస్తూ వారి జీవితాల్లో సానుకూల మార్పులకు కారణం కావాలి. ఇలాంటి చిత్రహింసలు జరగకుండా చూసుకోవడం, బాధితులకు అండగా నిలవడం మన కనీస కర్తవ్యమని తెలుసుకుందాం, చిత్రహింసలు లేని పౌర సమాజాన్ని నిర్మించుకుందాం.



-మధుపాలీ
9949700037

## ఎన్నికల్లో విజయం సాధించిన ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్ అలీకి, ప్రాస్పెరిటీ పార్టీకి భారత ప్రధాని అభినందన

న్యూ ఢిల్లీ, జూన్ 25: ఇథియోపియా పార్లమెంటు ఎన్నికల్లో నిర్ణయాత్మక విజయం సాధించిన ఆ దేశ ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీకి, ప్రాస్పెరిటీ పార్టీకి భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.

ఇథియోపియాతో చారిత్రక, బహుముఖీన, గాఢమైన సంబంధాలను ఎంతో విలువైనవిగా భారత్ భావిస్తుందని శ్రీ మోదీ పేర్కొన్నారు. గతేడాది తన ఇథియోపియా పర్యటనను ఆయన గుర్తు చేసుకున్నారు. భారత్ - ఇథియోపియా వ్యూహాత్మక భాగస్వామ్యాన్నీ, ఇరుదేశాల ప్రజల మధ్య స్నేహ బంధాలనూ మరింత బలోపేతం చేసుకునే దిశగా ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీతో కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

ఇథియోపియా పార్లమెంటు ఎన్నికల్లో నిర్ణయాత్మక విజయం సాధించిన నా మిత్రుడు, ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీకి, ప్రాస్పెరిటీ పార్టీకి హృదయపూర్వక అభినందనలు.

ఇథియోపియాతో చారిత్రక, బహుముఖీన, గాఢమైన సంబంధాలను ఎంతో విలువైనవిగా భారత్ భావిస్తుంది. గతేడాది ఇథియోపియా పర్యటన నాకు బాగా గుర్తుంది. మన వ్యూహాత్మక భాగస్వామ్యాన్నీ, మన ఇరుదేశాల ప్రజల మధ్య స్నేహ బంధాలనూ మరింత బలోపేతం చేసుకునే దిశగా కలిసి పనిచేయాలని ఆశిస్తున్నాను.

## బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులు, సీనియర్ భద్రతా అధికారులతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ

న్యూఢిల్లీ, జూన్ 25:బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులు, సీనియర్ భద్రతా అధికారులతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సమావేశమయ్యారు. ప్రస్తుత ప్రపంచ భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ కూటమికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు.

అంతర్జాతీయ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో కీలకమైన భద్రతా అంశాలపై సహకారాన్ని బలోపేతం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఉగ్రవాదం, సైబర్ భద్రత, అధునాతన సాంకేతికతలు సహా ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి సభ్య దేశాల మధ్య బలమైన సహకారం అవసరమన్నారు.

భారత్ అధ్యక్షత వహిస్తున్న వేళ.. సభ్య దేశాల మధ్య ఆచరణాత్మక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడంపై బ్రిక్స్ కూటమి ప్రధానంగా దృష్టి సారిస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాధాన్యాలను ప్రోత్సహించడానికి భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. సురక్షితమైన, మరింత భద్రమైన, సమ్మిళిత ప్రపంచాన్ని నిర్మించడంలో భారత్ ఎల్లప్పుడూ సహకారాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు.

బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులు, సీనియర్ భద్రతా అధికారులను కలవడం సంతోషంగా ఉంది.

అంతర్జాతీయ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో.. భద్రతా సహకారాన్ని పెంపొందించడంలోనూ, అలాగే ఉగ్రవాదం, సైబర్ భద్రత నుంచి అధునాతన సాంకేతికతల దాకా ఉమ్మడి సవాళ్లకు పరిష్కారాలను అందించడంలోనూ బ్రిక్స్ కీలక పాత్ర పోషిస్తుంది.

ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించడానికీ, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాధాన్యాలకు ప్రోత్సాహాన్నివ్వడానికీ, అలాగే సురక్షితమైన, భద్రమైన, సమ్మిళిత ప్రపంచ నిర్మాణానికీ భారత్ అధ్యక్షతన బ్రిక్స్ కృషి చేస్తుంది.

## ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించాలన్న నిబద్ధతను పునరుద్ఘాటించిన ఉభయ నేతలు

న్యూ ఢిల్లీ, జూన్ 25: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో ఖతార్ అమీరు శ్రీ షేఖ్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీ ఈ రోజు టెలిఫోన్లో మాట్లాడారు.

ఖతార్ లోని రాస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో జూన్ 21న సంభవించిన ఓ ప్రమాదంలో భారత జాతీయులు మరణించినందుకు ఖతార్ అమీర్ సంతాపాన్ని తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బాధిత కుటుంబాలకు సానుభూతిని తెలియజేసినందుకు అమీరుకు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. గాయపడిన వారికి తక్షణ వైద్య సాయాన్ని అందించడాన్ని మెచ్చుకున్నారు.

తమ పౌరుల శ్రేయస్సు, భద్రత పట్ల ఇద్దరు నేతలూ నిబద్ధతను పునరుద్ఘాటించారు. పరస్పరం సహాయాన్ని అందజేసుకోవాలని, సంఘీభావంతో నడుచుకోవాలని మరో సారి సంకల్పాన్ని చెప్పుకొన్నారు.

పశ్చిమాసియాలో స్థితిని ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, శాంతి యత్నాల్లో ఖతార్ సానుకూల తోడ్పాటును అందిస్తోందని ప్రశంసించారు. ఆ ప్రయత్నాలు పశ్చిమాసియాలో చిర శాంతికి, సుస్థిరతకు దోహదపడతాయన్న ఆశాభావాన్ని కూడా వ్యక్తం చేశారు.

ద్వైపాక్షిక సహకారాన్ని అన్ని రంగాల్లో విస్తరించుకునే విషయంలో ఇద్దరు నేతలూ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

తరచు సంప్రదింపులు జరుపుకొంటూ ఉండటానికి వారు అంగీకరించారు.

## డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా నివాళులు అర్పించిన ప్రధానమంత్రి... సంస్కృత సుభాషితాన్ని పంచుకున్న ప్రధాని

న్యూ ఢిల్లీ, జూన్ 25:డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు నివాళులు అర్పించారు. దేశ నిర్మాణానికి డాక్టర్ ముఖర్జీ అందించిన అపార సేవలను ప్రధాని స్మరించుకున్నారు.

డాక్టర్ ముఖర్జీ గొప్ప దేశ భక్తుడు, పండితుడు, భారత్ అభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన రాజనీతిజ్ఞుడు అని ప్రధానమంత్రి ప్రశంసించారు. డాక్టర్ ముఖర్జీ చాటిన తిరుగులేని దృఢవిశ్వాసం, ప్రజాజీవితం పట్ల కనబరిచిన ధైర్య సాహసాలు, దేశ హితం పట్ల ఆయన చాటిన నిబద్ధత తరాల తరబడి స్ఫూర్తిని అందిస్తుంటాయని శ్రీ మోదీ అన్నారు. దేశ ప్రజలు డాక్టర్ ముఖర్జీ త్యాగాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారని ప్రధాని అన్నారు.

డాక్టర్ ముఖర్జీకి గౌరవ పూర్వక నివాళులను ప్రధానమంత్రి అర్పిస్తూ దేశానికి, సమాజానికి నిస్వార్థంగా సేవ చేయడానికే డాక్టర్ ముఖర్జీ యావజ్జీవితాన్నీ అంకితం చేశారన్నారు. ఆయన ఆలోచనలు, ఆదర్శాలు మాతృభూమికి సేవ చేయడానికి దేశంలో ప్రతి ఒక్క తరానికీ స్ఫూర్తిని అందిస్తున్నాయని శ్రీ మోదీ అన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి "న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః పరేణ నాకం నిహితం గుహాయాం విభ్రాజతే యద్యతయో విశన్తి" అన్న ఓ సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్నారు.

పనులు, సంపద, లేదా వంశ పరంపర.. ఇవేవీ శాశ్వతత్వాన్ని సాధించిపెట్టలేవు. త్యాగం, ఉత్తమ ఆదర్శాల పట్ల పూర్తి అంకితభావాన్ని కలిగి ఉండడం ద్వారానే అమృతత్వాన్ని సాధించగలం. దేశం కోసం, సమాజం కోసం, సత్యం కోసం స్వప్రయోజనాలను కాదనుకొనే మహానుభావులు కాలం గీచిన గీతను కూడా దాటి జన హృదయంలో కొలువై ఉంటారని ఈ సుభాషితం మనకు చెబుతోంది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ:

"డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నాను. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశ భక్తుడు, పండితుడు, భారత్ ప్రగతికి జీవితాన్ని అంకితం చేసిన రాజనీతిజ్ఞుడు. ఆయన చాటిన తిరుగులేని దృఢవిశ్వాసం, ప్రజాజీవితం పట్ల కనబరిచిన ధైర్య సాహసాలు, దేశ హితం విషయంలో చాటిన నిబద్ధత తరాల తరబడి స్ఫూర్తిదాయకాలు. దేశ ప్రజలు డాక్టర్ ముఖర్జీ త్యాగాన్ని ఎప్పటికీ స్మరించుకుంటారు. ఆయన మనసులో నిలుపుకొని, తుది శ్వాస వరకూ విడనాడని విలువల అడుగుజాడలను అనుసరిస్తూ దృఢమైన, అభివృద్ధి చెందిన భారత్‌ను ఆవిష్కరించాలన్న నిబద్ధతను మేం పునరుద్ఘాటిస్తున్నాం.

"నిస్వార్థ భావంతో దేశసేవలో, సమాజ సేవలో జీవన పర్యంతం అంకితభావాన్ని చాటుకున్న దేశ మహా మనీషి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారికి ఆయన బలిదాన దినోత్సవం సందర్భంగా ఆదరపూర్వక శ్రద్ధాంజలి సమర్పిస్తున్నాను. ఆయన లోతైన ఆలోచనలూ, ఆదర్శాలూ మాతృభూమికి సేవ చేయాలన్న స్ఫూర్తిని దేశంలో ప్రతి తరానికీ అందిస్తూనే ఉంటాయి.

## మంచిర్యాలలో దారుణ హత్య.. కత్తిపోట్లతో వ్యక్తి మృతి



మంచిర్యాల, జూన్ 25: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాంధీనగర్ అండాలమ్మ కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో జలగుట్ట వద్ద ఓ వ్యక్తి కత్తిపోట్లతో దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది.

స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక వివరాల ప్రకారం మృతుడు మహబూబాబాద్ జిల్లా బయ్యారం ప్రాంతానికి చెందిన లక్‌పతి నాయక్‌గా గుర్తించారు. గుర్తుతెలియని దుండగులు అతనిపై కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు.ఇంత దారుణంగా హత్యకు పాల్పడిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. హత్యకు పాల్పడిన దుండగుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

## పొలాసలో ఉద్రిక్తత వాతావరణం..

### -రైతుల భూముల్లో చెట్లు నాటేందుకు అటవీశాఖ అధికారుల ప్రయత్నం



ఆదిలాబాద్, జూన్ 25: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని రావు జీగూడ పంచాయతీలో గల పొలాస గ్రామ శివారు ప్రాంతాల్లో రైతులు 50 సంవత్సరాల పైగా సాగు చేసుకుంటున్న పోడు భూములలో అటవీశాఖ అధికారులు ఆ భూములు అటవీ భూమిలేదని అందులో మొక్కలు నాటేందుకు జెసిపి తో సహా 30 మంది ఫారెస్ట్ అధికారులు ఉద్యోగులు వచ్చి జెసిబి తో చెట్లు నాటేందుకు గుంతలు తవ్వే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన రావుజిగూడ సర్పంచ్ జాదవ్ బహు రావు, మాజీ ఉపసర్పంచ్ షేక్ ఖలీల్ 100 మంది వరకు రైతులు వెళ్లి అటవీశాఖ అధికారులు తమ భూముల్లో చెట్లు నాటేందుకు గుంతలు తవ్వడానికి వచ్చిన జెసిబిని అడ్డుకున్నారు.

అటవీ శాఖ అధికారులకు రైతుల మధ్య వాగ్వి వాద మాటలు జరిగాయి.

అక్కడ అటవీశాఖ అధికారుల రైతుల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది ఈ విషయం తెలియగానే జైనూర్ సీఐ రమేష్ పోలీసులతో వెళ్లి రైతులకు అటవీశాఖ అధికారులతో సీఐ వివరాలు తెలుసుకొని సముదాయించారు. సర్పంచ్ బహు రావు తో పాటు రైతులు మాట్లాడుతూ దాదాపు21 మంది రైతులు 50 ఎకరాల్లో గత 1965 నుంచి సాగు చేసుకుంటున్నారని రెవెన్యూ రికార్డులో ఉందని పోలీసులకు అటవీ శాఖ అధికారులకు వివరించారు.

విషయాలు తెలుసుకున్న సీఐ ఫారెస్ట్ అధికారులతో మాట్లాడుతూ రెవెన్యూ,అటవీ శాఖ జాయింట్ సర్వే చేసిన తర్వాత రైతులు చూపించేఆధారాల ప్రకారంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు దీంతో అటవీశాఖ అధికారులు మాత్రం జిల్లా అటు విశాఖ అధికారి ఆదేశాల మేరకే వచ్చామని రైతులు గొడవలు చేస్తే ఎక్కువ మంది పోలీసులతో వచ్చి చర్యలు తీసుకొని ఈ భూముల్లో మొక్కలు నాటుతామని అటవీ అధికారి చెప్పడంతో రైతులు అగ్రహం వ్యక్తం చేశారు.

సీఐ సముదా యించడంతో అటవీశాఖ అధికారులు రైతులు వెళ్లిపోయారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం చల్లబడింది. పది రోజుల్లో తమ భూమి లేనని ప్రభుత్వం నుండి ఆర్డర్లు తెచ్చుకోవాలని ఫారెస్ట్ అధికారులు గడువు ఇచ్చారని, తెలపడంతో తాము ఆధారాలు చూపిస్తామని రైతులు ఒప్పుకున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు తిరిగి వెళ్ళిపోయారు.

పది రోజుల్లో ఆధారాలు తీసుకురాకుంటే మళ్లీ వచ్చి ఈ భూముల్లో అటవీశాఖ ద్వారా మొక్కలు నాడుతామని అటవీ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులతో పోలీసులతో అధికారులతో పేర్కొన్నారు. తమకు గడువు ప్రకారంగా ఆధారాలు తీయిస్తామని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ బాహు రావు, మాజీ ఉపసర్పంచ్ ఖలీల్, పులస గ్రామ వటేల్ కురుషాంగ ప్రసాద్, నాయకులు రైతులు పాల్గొన్నారు.

ఆహ్వానము
జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
డా॥రావూరి భరద్వాజ జయంత్యోత్సవం



జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డా॥రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారాన్ని శ్రీ పరవస్తు లోకేశ్వర్ గారికి
శ్రీమతి రావూరి కాంతమ్మ స్మారక సేవా పురస్కారాన్ని శ్రీమతి హరిప్రియ గారికి ప్రదానం



పురస్కార స్వీకర్తలు
శ్రీ పరవస్తు లోకేశ్వర్



సాహిత్యం
10,000/- రూపాయల నగదు పురస్కారం

శ్రీమతి హరిప్రియ



సంగీతం
5000/- రూపాయల నగదు పురస్కారం

ముఖ్యఅతిథి : డా॥పాలకుర్తి మధుసూదనరావు
పూర్వ సి.ఇ.ఒ.శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్, టి.టి.డి.
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు
సంపాదకులు, నేటినిజం దినపత్రిక
ఆత్మీయ అతిథి : శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ
సాహితీవేత్త
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు, సాహితీకిరణం
అతిథిసత్కారం : శ్రీ రావూరి వెంకట కోటేశ్వరరావు
ధర్మకర్త (ట్రస్టీ), డా॥రావూరి భరద్వాజ - రావూరి కాంతమ్మ ట్రస్ట్
సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
కవి, రచయిత

సాంస్కృతిక కార్యక్రమం
చిన్నారి శ్రీధృతి తిమ్మరాజుచే 'రామాయణశబ్దం' కూచిపూడి నృత్యం
&
కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయంవారి కూచిపూడి నృత్యం

తేది:05.07.2026, ఆదివారం సా॥5.00గం॥లకు
కళాలలిత కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ), చిక్కడపల్లి, హైదరాబాద్
లయన్ వి.వి.రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి : 9866332738

# ఓట్లు తొలగించేందుకు కుట్రలు..

**బీఎల్‌ఎలు అప్రమత్తంగా ఉండాలి..**
**ప్రజలకు సహకారం అందించాలి..**
**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల, జూన్ 25: (నేటినిజం ప్రతినిధి): ఓట్లు తొలగించేందుకు కుట్ర జరుగుతోందని, బీఎల్‌ఎలు అప్రమత్తంగా ఉంటూ.. ప్రజలకు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల వేములవాడ అర్బన్ మండలం చింతల్ తానా గ్రామంలో సర్పై అవగాహన



సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు అర్బన్ మండల బిఎల్‌ఎలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సర్ ప్రక్రియపై బీఎల్‌ఎలు అప్రమంతగా ఉండాలని, ప్రజలకు సహకరించాలని సూచించారు.

గతంలో 2002లో ఓటర్ సవరణ కార్యక్రమం చేపడితే మళ్లీ ప్రస్తుతం జరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ బిఎల్‌ఎ ల దగ్గర ఉన్న ఓటర్ లిస్టులో తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సామాజిక అవగాహనగా ఓటర్ లిస్టులో తమ పేరు ఉందో లేదో ప్రజలకు సమాచారాన్ని చేరవేయాలన్నారు. బీఎల్‌ఎలు ఎన్నికల సంఘం అనామాలిష్ లిస్టులో చేర్చిన ఓట్లను సరిచేన వారికి సమాచారాన్ని చేరవేయాలనరు. ఓటర్ లిస్టులో ఏదైనా కారణంతో పేర్ల లేకపోతే దరఖాస్తు ఫారం నింపి సంబంధిత సమాచారాన్ని గ్రామ మండల జిల్లా స్థాయి అధికారులకు చేరవేయాలన్నారు.

గల్ఫ్ వెళ్లిన వారు, విదేశాల్లో చదువుకున్న వారు వివరాలు వారి కుటుంబ సభ్యులు బిఎల్‌ఎలకు వారి వివరాలు ఇవ్వాలన్నారు. వారి కుటుంబ సభ్యులు అఫిడవిట్ రూపంలో అధికారులకు వివరాలు సమర్పించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో డప్పు చాటింపు, మైకులో చెప్పి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికి చాలా గ్రామాల్లో 80 శాతం పైగా ఓటర్ మ్యాపింగ్ జరిగిందని, ఇటీవలే నియోజకవర్గస్థాయిలో బిఎల్‌ఎలు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

బీజేపీ ప్రమాదకరంగా మరి ప్రశ్నించే గొంతులను, ప్రతి పక్ష వారి ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. బీజేపీ ఓట్ల చోరీ చేస్తూ దేశంలో ప్రమాద కారణంగా మారిందని, బెంగాల్, తమిళనాడు, వంటి రాష్ట్రాల్లో బీజేపీకి నచ్చని వారి ఓట్లు లక్షల్లో తొలగిస్తుందన్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి సొంత నియోజక వర్గంలో 36వేల ఓట్లు తొలగించారన్నారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటర్ లిస్టులో తమ ఓటు ఉందో లేదో ఒకసారి చూసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అర్బన్ మండల సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుతో పాటు బాధ్యత కూడా: సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్

కరీంనగర్, జూన్ 25: ఓటు ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, గూడెం గ్రామ సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ పేర్కొన్నారు.

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైతే సరిచేసుకోవాలని ఆయన సూచించారు. ఇంట్లో లేకపోయినా ఆన్‌లైన్ ద్వారా వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు, ఇతర వివరాలు సక్రమంగా నమోదై ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని ఆయన తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని గూడెల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు.

# నాణ్యమైన వైద్యం అందించాలి: ఎమ్మెల్యే

**మణుగూరులో ఎంఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం**



ఖమ్మం, జూన్ 25: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని అంబేద్కర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఇటువంటి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రి యాజమాన్యం అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ, ఈ ప్రాంత ప్రజలకు ఈ ఆస్పత్రి ఎంతో ఉపయోగపడాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, టౌన్ అధ్యక్షుడు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన

**-జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్**



ఖమ్మం, జూన్ 25:ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మంచి బోధనతో పాటు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ అన్నారు. బుధవారం కన్కల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపి వేలాది రూపాయల ఫీజులు చెల్లించి మోసపోవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు మంచి అధ్యాపక బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నాణ్యమైన మధ్యాహ్న భోజన వసతులను కల్పిస్తోందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచి ట్రిపుల్ ఐటీలకు ఎంపిక య్యారని పేర్కొన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. అనంతరం పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తాగునీటి వసతులు, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి రామస్వామి, గ్రామ సర్పంచ్ వైలారం రవీందర్ రెడ్డి, పులగం సాయి రెడ్డి, ఉప సర్పంచ్ మహేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం.

కరీంనగర్, జూన్ 25: భారత హజ్ కమిటీ ఆధ్వర్యంలో 2027 సంవత్సరానికి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు హజ్ కమిటీ అధికారిక వెబ్‌సైట్ లేదా 'హజ్ సువిధా' మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 22 నుంచి జూలై 20, 2026 రాత్రి 11:59 గంటల వరకు కొనసాగుతుందని, గడువు పొడిగింపునకు ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

జూలై చివరి వారంలో 'ఖుర్రా' (డిజిటల్ యాదృచ్ఛిక ఎంపిక) విధానం ద్వారా యాత్రికులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. తాత్కాలికంగా ఎంపికైన ప్రతి యాత్రికుడు ఆగస్టు 10, 2026లోపు రూ.1,52,300 అడ్వాన్స్ మొత్తాన్ని తప్పనిసరిగా జమ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

దరఖాస్తుదారులు మార్గదర్శకాలను పూర్తిగా చదివి, కనీసం 31 డిసెంబర్ 2027 వరకు చెల్లుబాటు అయ్యే మెషిన్ రీడబుల్ భారతీయ పాస్‌పోర్ట్, పాస్‌పోర్ట్ ముందు-వెనుక పేజీల స్కాన్ కాపీలు, తెల్లటి బ్యాక్‌గ్రౌండ్‌తో ఉన్న పాస్‌పోర్ట్ సైజు ఫోటో, బ్యాంక్ పాస్‌బుక్ లేదా రద్దు చేసిన చెక్ లీఫ్, చిరునామా ధ్రువీకరణ పత్రాల స్కాన్ కాపీలను మాత్రమే అప్‌లోడ్ చేయాలని సూచించారు.

హజ్ సీటు కేటాయించిన తర్వాత రద్దు చేసుకుంటే రమైన ఇబ్బందులు తలెత్తడంతో పాటు, కొత్త మార్గదర్శకాల ప్రకారం భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందని యాకూబ్ పాషా హెచ్చరించారు. కాబట్టి యాత్రికులు తమ సన్నద్ధతను, ప్రయాణంపై ఉన్న నిబద్ధతను పరిశీలించుకుని మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 8520860785 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

# సహాయక కార్యదర్శులుగా నియమితులైన 2024 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ ట్రైనీలతో సంభాషించిన ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 25:వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో సహాయ కార్యదర్శులుగా నియమితులైన 2024 బ్యాచ్‌కు చెందిన 183 మంది ఐఏఎస్ ట్రైనీలతో న్యూఢిల్లీలో సేవాతీర్థ్ వద్ద ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సంభాషించారు.

యువ ట్రైనీ అధికారులు తమ క్షేత్రస్థాయి శిక్షణ, వివిధ మంత్రిత్వ శాఖల్లో అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. అధికారులనుద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ.. రెండేళ్ల క్షేత్రస్థాయి అనుభవం, పరిపాలనాపరమైన అవగాహన అనంతరం వారిప్పుడు కీలక దశలో ఉన్నారని, ఇప్పుడు వారి నిర్ణయాలు సొంత కెరీర్లనే కాకుండా కోట్లాది ప్రజల భవిష్యత్తునూ తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. నిజాయితీ, సునిశితత్వం, అంకితభావంతో వాస్తవ పరిస్థితులను నిర్వహించడంలోనే ప్రజాసేవకు సంబంధించి అసలైన పరీక్ష ఎదురవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

బలమైన లక్ష్యస్ఫూర్తి, ఆవిష్కరణలు, ప్రజలే కేంద్రంగా పాలనతో.. దేశ నిర్మాణానికి అంకితభావంతో కృషి చేయాలని యువ సివిల్ సర్వెంట్లను ప్రధానమంత్రి కోరారు. పాలనకు సంబంధించిన ప్రతి ఫైలు వెనుకా ఉన్న మానవీయ కోణాన్ని అధికారులు ఎల్లవేళలా గుర్తుంచుకోవాలన్నారు. ప్రతీ ఫైలుతో ఎంతో మంది ప్రజల ఆకాంక్షలు, ఆందోళనలు, జీవితాలు ముడిపడి ఉంటాయన్నారు. 'నాగరిక్ దేవోభవ'నే మంత్రప్రదంగా భావించాలన్న ప్రధానమంత్రి.. ప్రతి నిర్ణయాన్నీ ప్రజలే కేంద్రంగా తీసుకోవాలని, సహానుభూతితో, బాధ్యతాయుతంగా, సమ్మిళితంగా పాలనను కొనసాగించాలని అధికారులకు పిలుపునిచ్చారు.

ఏకోన్ముఖ ప్రభుత్వ విధానాన్ని అవలంబించాలని చెబుతూ.. పెద్దపెద్ద అభివృద్ధి సవాళ్లను విడివిడిగా పరిష్కరించలేమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అర్థవంతమైన, దీర్ఘకాలిక ఫలితాలను సాధించాలంటే వివిధ విభాగాల మధ్య సమర్థమైన సమన్వయం అత్యవసరమని వ్యాఖ్యానించారు.'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ... రాబోయే దశాబ్దాలలో చేపట్టే ప్రతి విధానమూ, పాలనపరమైన నిర్ణయమూ అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి దోహదపడేలా ఉండాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా, తయారీ రంగంలో వృద్ధి, ఇంధన భద్రత, యువతకు అవకాశాల కల్పన వంటివి నేడు భారత్‌కు ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయన్నారు.

గత దశాబ్ద కాలంగా పరిపాలనలో విశేషమైన పరివర్తన వచ్చిందని ప్రధానమంత్రి అన్నారు. ప్రక్రియలే కేంద్రంగా ఉన్న దశ నుంచి ఫలితాలే ప్రాతిపదికగా గల విధానాల దిశగా.. పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. సేవలను మెరుగుపరచడంలో... ప్రజలు సులభంగా, పారదర్శకంగా సేవలను పొందేందుకు వీలు కల్పించడంలో... డిజిటల్ పాలన, కృత్రిమ మేధ, సాంకేతికత పాత్ర పెరుగుతుండడాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు.

డేటా ఆధారిత పాలన ప్రాధాన్యాన్ని వివరిస్తూ... డేటాను అంకెలుగా మాత్రమే కాకుండా, లక్షలాది ప్రజల జీవితాలు, సవాళ్లు, ఆకాంక్షలకు ప్రతిబింబంగా చూడాలని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. విధానాలు క్షేత్రస్థాయిలో సమర్థమైన ఫలితాలనిస్తున్నాయా, లేదా అనే విషయాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆయన కోరారు.

దేశ వికాసంలో మహిళల పాత్ర పెరుగుతుండడాన్ని ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రస్తుత బ్యాచ్‌లో 40 శాతానికి పైగా మహిళా అధికారులు ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు.దేశ నిర్మాణంలో తమ కృషిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, పదవుల వల్లే కాకుండా- తాము సాధించిన స్పష్టమైన ఫలితాలతోనే సంతృప్తిని పొందాలని యువ అధికారులను ప్రధానమంత్రి కోరారు. దేశ అభివృద్ధి ప్రస్థానాన్ని కొత్త శిఖరాలకు చేర్చడంలో వారి శక్తియుక్తులు, అంకితభావం కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.సిబ్బంది వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ జితేంద్ర సింగ్, ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె. మిశ్రా, ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి-2 శ్రీ శక్తికాంత దాస్, కేబినెట్ కార్యదర్శి శ్రీ టి.వి. సోమనాథన్, సిబ్బంది - శిక్షణ విభాగం కార్యదర్శి శ్రీమతి రచనా షా, ఎల్బీఎస్ఎన్ఏఏ డైరెక్టర్ శ్రీ శ్రీరామ్ తరణికంటి, ఇతర సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో రికార్డు స్థాయి భాగస్వామ్యంతో ప్రపంచ ఉద్యమంగా ఆవిర్భవించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026

న్యూఢిల్లీ, జూన్ 25:12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 వేడుకలు భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా మునుపెన్నడూ లేని రీతిలో భారీ ప్రజా భాగస్వామ్యానికి సాక్ష్యంగా నిలిచింది. సమగ్ర ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రపంచ ఉద్యమంగా యోగా ఎదుగుతున్న తీరును ఈ వేడుకలు మరోసారి స్పష్టం చేశాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో యోగా ప్రదర్శనలు, సామూహిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో గల చరిత్రాత్మక రెడ్ రోడ్‌లో జరిగిన వేడుకల్లో ఏకంగా 35,000 మంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సంవత్సరం "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" ఇతివృత్తంతో నిర్వహించిన ఈ వేడుకలు.. శారీరక దృఢత్వం, మానసిక స్థితిస్థాపకత, సమగ్ర శ్రేయస్సుకు యోగా అందించే సహకారాన్ని చాటిచెప్పింది. యోగాను ఒక జీవన విధానంగా మార్చుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఇది స్ఫూర్తినిచ్చింది.

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026ను ఒక నిజమైన ప్రపంచ వేడుకగా మార్చినందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, ఈజిప్టు, అనేక ఇతర దేశాలతో సహా వివిధ ఖండాల్లో భారీ ఎత్తున యోగా కార్యక్రమాలను నిర్వహించారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం నుంచి ఐరోపా, పశ్చిమ ఆసియా, ఆఫ్రికా, తూర్పు ఆసియాలోని ప్రధాన నగరాల వరకు ప్రతిచోటా ప్రజలు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఇది ఆరోగ్యం, ప్రశాంతత, సామూహిక శ్రేయస్సుకు ఒక వారధిగా విశ్వవ్యాప్తంగా యోగాకు లభించిన గొప్ప ఆదరణను ప్రతిబింబించింది.

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పౌరులు, యోగా అభ్యాసకులు, వాలంటీర్లు, వివిధ సంస్థల సహకారాన్ని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ జాదవ్ అభినందించారు. "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" ఇతివృత్తంతో సాగిన ఈ కార్యక్రమంలో ప్రజలు చూపిన ఉత్సాహం.. ఆరోగ్యం, సామరస్యం, సామూహిక శ్రేయస్సును పెంపొందించడంలో యోగా పాత్రను మరోసారి నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన, సంతోషకరమైన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రజలు చూపిన ఉత్సాహంపై కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా హర్షం వ్యక్తం చేశారు. దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనడం చూస్తుంటే యోగా ఒక జీవన విధానంగా విశ్వవ్యాప్త ఆదరణ పొందుతోందని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఇంతటి ఘన విజయం సాధించడానికి సహకరించిన పౌరులు, వాలంటీర్లు, నిర్వాహక సంస్థలు, భాగస్వాములందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సంవత్సరం ఇతివృత్తం 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' ప్రాధాన్యతను గుర్తు చేస్తూ.. సమగ్ర ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ యోగాను తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు.

దేశంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకల్లో దేశ సర్వోన్నత నాయకులు స్వయంగా పాల్గొన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన యోగా ప్రదర్శనలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పాల్గొనగా, లడఖ్‌లోని లేహ్‌లో జరిగిన వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ భాగస్వాములయ్యారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా యోగా కార్యక్రమానికి నాయకత్వం వహించి దేశవ్యాప్త భాగస్వామ్య స్ఫూర్తిని చాటారు.

ఈ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా కేంద్రం, జాతీయ ఆయుష్ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన "గంగోత్రి నుంచి గంగా సాగర్ వరకు" ప్రచార కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు దాదాపు 2,525 కిలోమీటర్ల మేర సాగిన ఈ ప్రచారంలో.. రిషికేశ్, హరిద్వార్, ప్రయాగ్‌రాజ్, వారణాసి, పాట్నా, హుగ్లీలోని ప్రసిద్ధ నదీతీర ప్రాంతాలను కలుపుతూ ఉమ్మడి యోగా నియమావళి ప్రకారం యోగాసనాల ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దేశపు అత్యంత గొప్ప చారిత్రక వారసత్వాలైన పవిత్ర గంగానది, ప్రాచీన యోగా అభ్యాసాన్ని ప్రతీకాత్మకంగా ఏకం చేస్తూ సాగిన ఈ కార్యక్రమం.. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలందరిలో "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా", సమగ్ర ఆరోగ్య సందేశాన్ని పంపింది.

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా రెడ్ రోడ్‌లో జరిగిన ప్రధాన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముందు.. ప్రజల భాగస్వామ్యాన్ని, అవగాహనను పెంచే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా పలు యోగా నేపథ్యంతో కూడిన వినూత్న కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా కోల్‌కతాలోని 11 ప్రాంతాలలో 'దౌడ్ సే ధ్యాన్' (పరుగు నుంచి ధ్యానం వైపు) పేరిట మారథాన్లను నిర్వహించి.. పౌరులు యోగాను, ఆరోగ్యాన్ని అలవర్చుకునేలా ప్రోత్సహించారు. వీటితోపాటు హుగ్లీ నదీ తీరంలో వందే యోగం, పశ్చిమ బెంగాల్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

# నాఫెడ్ ఈ-వేలం పోర్టల్ నాఫెక్స్ ను ప్రారంభించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జూన్ 25:'నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)' ఈ-వేలం పోర్టల్ అయినర నాఫెక్స్ (ఔంఈఇఛీ.తిని)ను ఈ రోజు ఢిల్లీలో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్.. సహకార శాఖ సహాయ మంత్రి శ్రీ కృష్ణ పాల్ గుర్జర్, సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశిష్ కుమార్ భుటానీ, నాఫెడ్ ఛైర్మన్ శ్రీ జేఠాభాయ్ అహిర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ.. నాఫెడ్ ఈ రోజు నాఫెక్స్, ద్రిష్టి, ఈఆర్‌పీ, నాఫెడ్ కళ్యాణ్ పేర్లతో నాలుగు ప్రధాన కార్యక్రమాలను ప్రారంభించిందని తెలిపారు. 2014లో నాఫెడ్ మూతపడే స్థాయికి చేరుకుందన్నప్పటికీ ఈ సరికొత్త ప్రయత్నాల వల్ల నేడు ఆ సంస్థ రూ. 30,000 కోట్ల ఆదాయం, రూ. 500 కోట్ల లాభంతో దేశంలోని 74 లక్షల మందికి పైగా రైతులకు సేవలు అందిస్తోందని అన్నారు. అందుకే నాఫెక్స్ తో పాటు మిగిలిన కార్యక్రమాలు ఎంతో కీలకమైనవని ఆయన పేర్కొన్నారు.

నాఫెడ్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దీనిని పూర్తి పారదర్శకతతో నడపాలని నిర్ణయించారని శ్రీ అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నాఫెడ్‌కు ఆర్థిక సహాయాన్ని అందించడం దీనిని మరోసారి మంచి స్థాయిలో నిలబెట్టిందని ఆయన తెలిపారు.

నేడు ఉత్పత్తి, కొనుగోలు రెండింటిలోనూ నాఫెడ్ గణనీయమైన వృద్ధిని నమోదు చేసిందని శ్రీ అమిత్ షా తెలిపారు. పప్పుధాన్యాల రంగంలో దేశాన్ని స్వయంసమృద్ధిగా మార్చడానికి.. ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ సంస్థలు పప్పుధాన్యాల ప్రతి గింజనూ నేరుగా రైతుల నుంచే కొనుగోలు చేసే దిశగా వేగంగా అడుగులు వేయాల్సి ఉందన్నారు. ఇది రైతులకు తగిన గిట్టుబాటు ధరలను నిర్ధారిస్తుందని.. దీనివల్ల పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెరిగి పప్పుధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయంసమృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.

గడిచిన మూడేళ్లలో పప్పుధాన్యాలు, మొక్కజొన్న, ఇతర పంట ఉత్పత్తులను నేరుగా కొనుగోలు చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించినట్లు కేంద్ర సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా తెలిపారు. ఇప్పుడు ఈ మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థలు పూర్తి నిబద్ధత, పారదర్శకతతో పనిచేయాలని.. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో రైతులందరూ పప్పుధాన్యాలను నేరుగా ఈ రెండు సంస్థలకే విక్రయించేలా, అందుకు సంబంధించిన చెల్లింపులను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన ప్రకటించారు.

నేడు నాఫెడ్ కేవలం వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకే పరిమితం కాలేదని శ్రీ అమిత్ షా తెలిపారు. గత మూడేళ్లలో నాఫెడ్ సంస్థ సేంద్రియ వ్యవసాయం, విత్తనోత్పత్తి, చిల్లర వర్తకం, జీవ ఎరువుల తయారీ, ఆహార భద్రత, అంతర్జాతీయ వాణిజ్యం వంటి రంగాల్లో అద్భుతమైన పనితీరును కనబరిచిందని.. ఇది నాఫెడ్ ప్రాధాన్యత, లాభదాయకతను రెండింటినీ పెంపొందించిందని ఆయన పేర్కొన్నారు. సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటైనప్పుడు నాఫెడ్ ఆదాయం రూ. 20,000 కోట్లుగా ఉండగా ఇప్పుడు అది రూ. 30,000 కోట్లకు పెరిగిందని ఆయన చెప్పారు. రాబోయే రెండేళ్లలో ఈ ఆదాయం రూ. 50,000 కోట్ల మార్కును దాటుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. నాఫెడ్ నికర లాభం రూ. 139 కోట్ల నుంచి రూ. 405 కోట్లకు పెరిగిందని.. ఆ సంస్థ నికర విలువ రూ. 358 కోట్ల నుంచి రూ. 2,050 కోట్లకు చేరిందని ఆయన వివరించారు. నేడు నాఫెడ్ ఒక బలమైన, ఆర్థికంగా సమర్థవంతమైన, స్వయంసమృద్ధి గల సంస్థగా అవతరించిందని ఆయన అన్నారు

# భారత నౌకా వాణిజ్య రంగాలను పరిరక్షించేందుకు ప్రత్యేక ఎల్ నినో బులెటిన్‌లను ప్రారంభించిన ఇన్‌కాయిస్

న్యూఢిల్లీ, జూన్ 25:ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో కారణంగా నౌకా వాణిజ్య రంగాలు ఎదుర్కొనే అవకాశం ఉన్న ప్రభావాల గురించి తెలియజేసేందుకు ఇన్‌కాయిస్ ప్రత్యేక ఎల్ నినో బులెటిన్లను ప్రారంభించింది. 2026 జూన్ 22న ఇన్‌కాయిస్‌లో జరిగిన కార్యక్రమంలో మొదటి బులెటిన్‌ను చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు.

ఎల్ నినో ప్రభావం మరింత పెరుగుతుందని, శీతాకాల సమయం (2026 నవంబర్ నుంచి 2027 జనవరి) నాటికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని ఈ బులెటిన్ ధ్రువీకరించింది. దీని ఫలితంగా 2027 ఏప్రిల్/మే వరకు హిందూ మహా సముద్ర ఉపతరిల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి. రాబోయే నెలల్లో ముఖ్యంగా ఉత్తర హిందూ మహా సముద్రంలోని (అరేబియా సముద్రం, బంగాళాఖాతం రెండింటిలోనూ) సముద్ర జీవావరణ వ్యవస్థ.. ఉష్ణోగ్రతల వల్ల ఎదురయ్యే ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా 2027 మార్చి నుంచి మే మధ్య ఈ ఒత్తిడి అధికంగా ఉండొచ్చు. దీనివల్ల పగడపు దీవులు (కోరల్ రీఫ్స్) తెలుపు రంగులోకి మారడం, సముద్ర ఉష్ణ తరంగాలు ఎక్కువగా సంభవించడం, అనువైన ఆవాసాలకు చేపలు వలస వెళ్లడం లేదా వాటి సంతానోత్పత్తి తగ్గడం వల్ల చేపల వేట (ముఖ్యంగా సార్డిన్, మాకెరెల్ జాతులు) తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా, పెరుగుతున్న ఎల్ నినో ప్రభావం వల్ల సముద్ర పర్యావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా చేపలు ఆశించిన పరిమాణానికి పెరగకపోవచ్చు.

రుతుపవన కాలంలో బంగాళాఖాతం అల్లకల్లోలంగా ఉంటుంది. భారతదేశ తూర్పు తీరంలో కోత, వరదలు పెరిగే అవకాశం ఉంది. దీనికి భిన్నంగా అరేబియా సముద్రం, పశ్చిమ తీర ప్రాంతం సాధారణం కంటే ప్రశాంతంగా ఉండే అవకాశం ఉంది. ఇది సానుకూలాంశం. దీని వల్ల వివిధ సముద్ర సంబంధిత రంగాల కార్యకలాపాలు పెరుగుతాయి. కొనసాగుతున్న రుతుపవన కాలంలో పశ్చిమ తీరంలో కోత, ముంపు తక్కువగా ఉండొచ్చు.

ఎప్పటికప్పుడు జారీ చేసే హెచ్చరికలను, సూచనలను, సలహాలను నౌకా రవాణా నిర్వాహకులందరూ పరిగణనలోకి తీసుకోవాలని ఇన్‌కాయిస్ సూచించింది. ప్రత్యేక బులెటిన్ రెండో సంచికను 2026 జులై రెండో వారంలో జారీ చేస్తారు

# దేశ కీలక ఖనిజాల మిషన్‌కు ఊతం: 56 కీలక ఖనిజాల బ్లాకులు, 11 అన్వేషణ లైసెన్సు బ్లాకులకు విజయవంతంగా వేలం

న్యూఢిల్లీ, జూన్ 25:కీలక, వ్యూహాత్మక ఖనిజాల బ్లాకుల వేలాన్ని ఇటీవల విజయవంతంగా పూర్తిచేయడం ద్వారా.. దేశ కీలక ఖనిజ భద్రతనూ, ఖనిజాన్వేషణ వ్యవస్థనూ బలోపేతం చేయడంలో కీలక మైలురాళ్లను కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అధిగమించింది. తాజా వేలం ప్రక్రియలు విజయవంతం కావడంతో.. ఇప్పటి వరకు దేశంలో విజయవంతంగా వేలం వేసిన మొత్తం కీలక, వ్యూహాత్మక ఖనిజాల బ్లాకుల సంఖ్య 56కు చేరింది. దేశీయ ఖనిజ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంతోపాటు, దేశ కీలక ఖనిజాల మిషన్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఇదొక కీలకమైన ముందడుగు.

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఏడో విడత కింద.. 10 కీలక, వ్యూహాత్మక ఖనిజాల బ్లాకులను గనుల మంత్రిత్వ శాఖ విజయవంతంగా వేలం వేసింది. దీంతో దేశంలో విజయవంతంగా వేలం పూర్తయిన మొత్తం కీలక, వ్యూహాత్మక ఖనిజాల బ్లాకుల సంఖ్య 56కు చేరింది. కేంద్ర ప్రభుత్వం వేలం చేపట్టిన మొత్తం 88 ప్రత్యేక ఖనిజ బ్లాకుల్లో 56 బ్లాకులకు.. అంటే 63 శాతానికి పైగా విజయవంతంగా వేలం పూర్తయింది.

దేశ కీలక ఖనిజాన్వేషణ పరిధిని విస్తరించడంలో ఏడో విడత వేలం ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. గుజరాత్, ఉత్తరాఖండ్, తెలంగాణల్లో కీలక ఖనిజాల బ్లాకులను మొదటిసారిగా ఈ దశలోనే కేంద్ర ప్రభుత్వం వేలం వేసింది. ఈ విడతలో గ్రాఫైట్, అరుదైన ఖనిజ మూలకాలు (ఆర్ఈఈ), వెనాడియం, టైటానియం, గ్లకోనైట్, శిలా ఫాస్ఫేట్, వాటి అనుబంధ ఖనిజాలున్నాయి. దేశంలో కీలక ఖనిజాల అన్వేషణకు సంబంధించి భౌగోళిక విస్తృతిని ఇది మరింత పెంచింది.

2026 మార్చి 23న జారీ చేసిన టెండర్ల ఆహ్వాన ప్రకటన ద్వారా ఈ ఏడో విడత వేలం ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా కీలక, వ్యూహాత్మక ఖనిజాలున్న 19 ఖనిజాల బ్లాకులను వేలానికి ఉంచారు. ఎప్పటికప్పుడు సవరిస్తూ వచ్చిన.. గనులు – ఖనిజాల (అభివృద్ధి – నియంత్రణ) చట్టం – 1957, ఖనిజాల (వేలం) నియమాలు– 2015 లోని నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ వేలం ప్రక్రియను నిర్వహించింది.

కీలక ఖనిజాల వేలంతో పాటు, దేశ ఖనిజాన్వేషణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా.. ఖనిజాన్వేషణ లైసెన్సుల (ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్సులు) వేలం రెండో విడతను కూడా గనుల మంత్రిత్వ శాఖ విజయవంతంగా పూర్తి చేసింది. లైసెన్సుల విధానాన్ని మొదటిసారిగా అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఈ విడతలో విస్తరించింది. కీలక, భూగర్భ లోతుల్లో ఉండే ఖనిజాలను గుర్తించడంలో కొత్త అవకాశాలనూ ఇది అందుబాటులోకి తెచ్చింది.

ఈ రెండో విడత విజయవంతంగా పూర్తి కావడంతో.. దేశంలో ఖనిజాన్వేషణ లైసెన్సుల (ఈఎల్) వేలం విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా వేలం వేసిన మొత్తం ఈఎల్ బ్లాకుల సంఖ్య 11కి చేరింది. ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా.. దేశంలో భూగర్భంలో చాలా లోతున ఉండే ఖనిజాలు, కీలక ఖనిజాల క్రమబద్ధమైన అన్వేషణకు ఈ లైసెన్సు విధానం వీలు కల్పిస్తుంది.

దేశ ఖనిజ రంగంపై పరిశ్రమ భాగస్వామ్య పక్షాల్లో నమ్మకం పెరుగుతోందనేందుకు.. కీలక ఖనిజాలు, అన్వేషణ అనుమతుల వేలం ప్రక్రియలు ఎప్పటికప్పుడు విజయవంతమవుతుండడమే నిదర్శనం. దేశంలో క్రమబద్ధమైన అన్వేషణను ప్రోత్స హించడానికీ, పెట్టుబడులను ఆకర్షించడానికీ, దేశీయ ఖనిజ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడానికీ ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన సంస్కరణల ప్రభావాన్ని ఇది స్పష్టం చేస్తోంది.

హరిత ఇంధన సాంకేతికతలు, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, అధునాతన తయారీ రంగం, ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగ అప్లికేషన్లు, దేశ ఆర్థిక వ్యవస్థలోని ఇతర వ్యూహాత్మక రంగాలకు అత్యంత ఆవశ్యకమైన కీలక ఖనిజాల అన్వేషణ, అభివృద్ధిని ఈ చర్యలు మరింత వేగవంతం చేస్తాయి.

జాతీయ కీలక ఖనిజాల మిషన్ లక్ష్యాలను సాధించడం, ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ఇతర దేశాల నుంచి దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడంతోపాటు.. దేశం కోసం కీలక, వ్యూహాత్మక ఖనిజ సంపద నిల్వలను సృష్టించే దిశగా కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ విజయవంతమైన వేలం ప్రక్రియలు పునరుద్ఘాటిస్తున్నాయి.

వేలం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మద్దతును, సహకారాన్ని అందించిన బిడ్డర్లు, రాష్ట్ర ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, ఇతర భాగస్వాములందరినీ గనుల మంత్రిత్వ శాఖ అభినందిస్తోంది. దేశంలో ఖనిజాన్వేషణ అవకాశాలను విస్తరించడంతోపాటు.. పారదర్శకమైన, సమర్థమైన, పెట్టుబడిదారులకు అనుకూలమైన ఖనిజ వ్యవస్థను నిర్మించడానికి గనుల మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

# ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## -విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేసిన కొరివి వెంకన్న



నల్గొండ, జూన్ 25: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ వ్యాపారవేత్త, సమాజసేవకుడు కొరివి వెంకన్న పిలుపునిచ్చారు. చిట్యాల పురపాలక పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు బోడ సుశీల అధ్యక్షతన పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా కొరివి వెంకన్న మాట్లాడుతూ, క్రమశిక్షణతో కష్టపడి చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ విజయం వారి బాధ్యతను మరింత పెంచిందని, ఇదే పట్టుదలతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రధానోపాధ్యాయురాలు బోడ సుశీల మాట్లాడుతూ, విద్యార్థులు తమ స్వయంకృషితో సంపాదించిన ఈ పురస్కారాలు ఎంతో విలువైనవని అన్నారు. నగదు బహుమతులను వృథా చేయకుండా చదువుకు అవసరమైన పుస్తకాలు కొనుగోలు చేయడానికి లేదా జ్ఞానాన్ని పెంపొందించే పనులకు వినియోగించాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలని విద్యార్థులకు హితవు పలికారు.

పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన గండవరం సంకీర్తనకు రూ.20 వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానం పొందిన ఎం.డి. షాహిన్‌కు రూ.15 వేల నగదు బహుమతి, తృతీయ స్థానం సాధించిన మంద శ్రీవాణికి రూ.10 వేల నగదు బహుమతిని అందజేసి సత్కరించారు. అనంతరం విద్యార్థులను ప్రోత్సహించిన కొరివి వెంకన్నను పాఠశాల యాజమాన్యం శాలువాతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు బూరుగు కృష్ణయ్య, పాలాది రమేష్, ఉపాధ్యాయులు చిలకరాజు శ్రీనివాస్, ఏ. పద్మజ, కోణం శ్రీనివాస్, జి. ఇందిర, ఏ. కవిత, ఎస్. సైదులు, సీహెచ్. ప్రసన్న, జి. శైలజ, ఎం.డి. సాదిక్, ఎం. జానకి, ఎం. సౌమ్య, ఎస్. ప్రవీణ, డి. కుసుమ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరును గుర్తించాలి

## -ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన సర్పంచ్



నల్గొండ, జూన్ 25: సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను చిట్యాల మండలంలోని సుంకెనపల్లి గ్రామంలో సర్పంచ్ ఆవుల సునీత యాదయ్య పరిశీలించారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరును గుర్తించాలని బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సర్వే నిర్వహిస్తున్న ఓ ఇంటిని సందర్శించి బీఎల్‌వోను అడిగి సర్వే విధానం, నమోదు ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ సర్వే విజయవంతం కావాలంటే గ్రామస్తులంతా పూర్తి స్థాయిలో సహకరించాలని సర్పంచ్ ఆవుల సునీత యాదయ్య కోరారు. అనంతరం సర్పంచ్ కుటుంబ సభ్యులందరూ తమ ఓటరు జాబితా సవరణ దరఖాస్తు ఫారాలను బీఎల్‌వోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నిజామాబాద్, జూన్ 25:నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం పిప్రి (జె)గ్రామంలో గురువారం నూతన గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా జంగం గంగారం, క్యాషియర్‌గా స్వామి,అనిల్, ఎన్నికయ్యారు. సభ్యులుగా కొడిగల స్వామి, నాలగంటి పరమేష్, సుంకరి భూమన్న, అశోక్ బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన వీడిసి అధ్యక్షులు మాట్లాడుతూ,మాపై నమ్మకంతో గ్రామ అభివృద్ధి అధ్యక్షుడు ఎన్నుకున్నందుకు గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.అలాగే నూతన వీడీసీ సభ్యులను సర్పంచ్ అరిగెల జనార్దన్ ఘనంగా శాలువా పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతూ, గ్రామ అభివృద్ధికి కమిటీ సభ్యులంతా సాయశక్తులా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పతాని జేమ్స్, పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## -మెడికల్ ఆఫీసర్ అజయ్ పవర్ సూచన

నిజామాబాద్, జూన్ 25: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈనెల 28 ఆదివారం జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ వైద్యుడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజయ్ కోరారు.ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ అజయ్ పవర్ మీడియాతో మాట్లాడుతూ, భీమ్‌గల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల వారు పుట్టిన పిల్లల నుండి ఐదేళ్లలోపు పిల్లలకు రెండు చుక్కల పోలియో మందు వేయించాలన్నారు.మున్సిపాలిటీ, గ్రామాలలోని 42 బూత్‌లలో ఉదయం 7:30 నుండి మందు అందుబాటులో ఉంటుందని తెలిపారు.తల్లిదండ్రులు తప్పకుండా పిల్లలకు పోలియో రాకుండా, వైకల్యంలో మార్పు వచ్చి వారు వికలాంగులుగా మారకుండా కాపాడుకోవడానికి ఈ పోలియో చుక్కలు వేయించడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

# ప్రభుత్వ నిశిత పర్యవేక్షణ: ఇథనాల్ మిశ్రణ కార్యక్రమానికి శాస్త్రీయ ధ్రువీకరణ

న్యూ ఢిల్లీ, జూన్ 25:ఇథనాల్ మిశ్రమ పెట్రోలు (ఈబీపీ)పై సామాజిక మాధ్యమాల్లో నిరాధార, తప్పుదోవ పట్టించే ప్రచారం సాగుతుండటాన్ని కేంద్ర ప్రభుత్వం గమనించింది. ప్రజలను గందరగోళానికి గురిచేసి, అపోహలు సృష్టించడమే లక్ష్యంగా ఇవి సాగుతున్నట్లు భావిస్తోంది. ఇథనాల్-మిశ్రమ ఇంధనంపై అనవసర ఆందోళన సృష్టి ధ్యేయంగా వీక్షకులను ఆకర్షించేలా పాత చిత్రాలు, వీడియోలను పునఃప్రచారంలోకి తెస్తున్నట్లు ప్రభుత్వం పసిగట్టింది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిశిత, నిరంతర పర్యవేక్షణ ద్వారా ఇథనాల్ మిశ్రణ కార్యక్రమానికి శాస్త్రీయ ధ్రువీకరణ లభించిందని కేంద్ర పెట్రోలియం-సహజ వాయువుల మంత్రిత్వశాఖ పునరుద్ఘాటించింది.

ముడి చమురు దిగుమతుల తగ్గింపు, ఇంధన భద్రత పెంపు, పర్యావరణ సుస్థిరతకు ప్రోత్సాహం లక్ష్యాలుగా 2003లో ఇథనాల్ మిశ్రణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాంకేతిక సన్నద్ధత, భాగస్వాములతో సంప్రదింపులు ప్రాతిపదికగా ఇది దశలవారీగా అమలవుతోంది. ఫలితంగా 2023 నుంచి 20 శాతం ఇథనాల్ మిశ్రమ పెట్రోలు (ఇ20) వాడకాన్ని ప్రవేశపెట్టింది.

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ), ఆటోమొబైల్ తయారీదారులు, ఇంధన తనిఖీ సంస్థలు, ఇతర భాగస్వాములతో సంప్రదింపుల ద్వారా ఇథనాల్ మిశ్రణ కార్యక్రమం అమలును ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది.

'ఇ20' పెట్రోలు వినియోగాన్ని ప్రవేశపెట్టిన నాటినుంచి దానివల్ల వాహన ఇంజిన్ల వైఫల్యం లేదా వాహనాలు అర్థాంతరంగా ఆగిపోవడం వంటి విస్తృత సమస్యలపై ఫిర్యాదులేవీ రాలేదని పేర్కొంది.

తేమను పీల్చుకునే ఇథనాల్ స్వభావానికి సంబంధించి ప్రస్తుతం ఒక వాదన ప్రచారంలోకి వచ్చింది. ఇథనాల్ మిశ్రమ పెట్రోలు లేదా మరేదైనా ఇంధనం విషయంలోనైనా వాహన ట్యాంకులోకి నీరు ప్రవేశించడం మంచిది కాదనే వాస్తవం అందరికీ తెలిసిందే. అంతేగాక ఆధునిక వాహనాల ఇంధన ట్యాంకులలోకి నీరు, తేమ నిరోధానికి తగిన లక్షణాలతో తయారీ సంస్థలు రక్షణ చర్యలు చేపడుతున్నాయి.

అంతేకాకుండా కొందరు వ్యక్తులు చెరకు రసాన్ని నేరుగా పెట్రోల్‌లో కలుపుతున్నట్లు తప్పుదోవ పట్టించే చిత్రాలతో సామాజిక మాధ్యమాల్లో మీడియాలో వీడియోలను సృష్టించి ప్రచారంలోకి తెస్తున్నట్లు ప్రభుత్వం గమనించింది. అది కచ్చితంగా తప్పుదోవ పట్టించే, నిరాధార దుష్ప్రచారమేనని నిర్ణయానికి వచ్చింది. ఇంధన మిశ్రమానికి వాడే ఇథనాల్ సుస్థిర పారిశ్రామిక ప్రక్రియల ద్వారా ఉత్పత్తి అవుతుంది. దీన్ని పెట్రోలుతో కలిపే ముందు కఠిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షిస్తారు.

ఇథనాల్‌ను చెరకు రసం, మొలాసిస్, నూకలు, మొక్కజొన్న వంటి వివిధ రకాల ముడి పదార్థాలతో తయారు చేస్తారు. అయినప్పటికీ, అంతిమ ఉత్పత్తి లక్షణాలు ముడి పదార్థాల లక్షణాలకు భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే ఇది కిణ్వణం సహా అనేక రకాల ప్రక్రియలతో తయారవుతుంది. ఈ ప్రక్రియ ముడి పదార్థాలలోని చక్కెరల కిణ్వ ప్రక్రియకు దారితీస్తుంది.

ఇలాంటి వీడియోలతో దుష్ప్రచారం ద్వారా ఈ అంశాన్ని సంచలనాత్మకం చేస్తూ, వాటి వీక్షణలను పెంచుకోవడానికే కొందరు ప్రయత్నిస్తున్నారని స్పష్టమవుతోంది.

భారత్‌లో ఇథనాల్ మిశ్రణం కఠిన ఇంధన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సాగుతుంది. దీంతోపాటు వాహనాల్లో వినియోగానికి ముందు క్షుణ్ణంగా తనిఖీ కూడా చేస్తారు. విస్తృతమైన సాంకేతిక అంచనాలు, వాహన తయారీదారులు, ఇతర భాగస్వాములతో సంప్రదించిన తర్వాత మాత్రమే అధిక స్థాయి మిశ్రణ ప్రక్రియను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

అయితే, ఇటీవల ఒక వాహన ఇంధన ట్యాంకు వద్ద చీమలు కనిపించే వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది.

# వెల్లటూరులో కేడీసీసీబీ నూతన శాఖ ప్రారంభం..

## -రైతులు, మహిళలకు మరింత చేరువలో బ్యాంకింగ్ సేవలు



అమరావతి, జూన్ 25: ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) నూతన శాఖను గురువారం ఘనంగా ప్రారంభించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి శాఖను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సహకార రంగాన్ని బలోపేతం చేయడం, రైతులు, డ్వాక్రా మహిళలు, చిరు వ్యాపారులకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వెల్లటూరు, పరిసర గ్రామాల ప్రజల చిరకాల కోరిక నూతన శాఖ ప్రారంభంతో నెరవేరిందని తెలిపారు. ఈ శాఖ ద్వారా రైతులకు సకాలంలో పంట రుణాలు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహకారం మరింత వేగంగా అందుతుందని పేర్కొన్నారు.

కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా కేడీసీసీబీ పనిచేస్తోందన్నారు. వెల్లటూరు శాఖ ఏర్పాటు వల్ల ఈ ప్రాంత రైతులు, మహిళా సంఘాలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, రికవరీలో కేడీసీసీబీ రాష్ట్రంలోనే ముందంజలో ఉందని తెలిపారు.

నూతన శాఖ ద్వారా పంట రుణాలు, డ్వాక్రా రుణాలు, బంగారు రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు, డిపాజిట్ పథకాలు తదితర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని బ్యాంకు అధికారులు వెల్లడించారు. రైతులు పాస్‌బుక్, ఆధార్ కార్డులతో నేరుగా లావాదేవీలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, బ్యాంకు అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీడీపీ జెండా దిమ్మె ధ్వంసం

## -పునర్నిర్మింపజేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



అమరావతి, జూన్ 25:పెనమలూరు నియోజకవర్గం కానూరులో టిడిపి జెండా దిమ్మను వైసీపీ శ్రేణులు ధ్వంసం చేశారు. ఘటన స్థలానికి భారీగా టిడిపి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆయన అనుచరులు చేరుకున్నారు. పరిస్థితుల నడుమ భారీగా పోలీసులు చేరుకున్నారు. ధ్వంసం చేసిన జెండా దిమ్మె స్థానంలో నూతన జెండాదిమ్మను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పునర్నిర్మించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ కుట్రపూరితంగా 1982వ సంవత్సరం నుంచి ఉన్న జెండాదిమ్మను వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి దేవ భక్తుని చక్రవర్తి తొలగించారన్నారు. చక్రవర్తి తాత దేవ భక్తుని వెంకటేశ్వరరావు అనధికారికంగా నిర్మించిన విగ్రహానికి ప్రహరీ నిర్మించే క్రమంలో జెండాదిమ్మెను చక్రవర్తి అనుచరులు తొలగించారన్నారు. శాసనసభ్యునికి ఫోన్ చేసి బెదిరించిన మాలపాటి భాస్కర్ రెడ్డిని సపోర్టు చేస్తూ విలేకరుల సమావేశాన్ని నిర్వహించడం నియోజకవర్గం చూసిందన్నారు. కానూరు పరిధిలో అభివృద్ధిని అడ్డుకోవడానికి కోర్టులో పిటిషన్లు వేసిన సైకో చక్రవర్తి అన్నారు.

జెండా దిమ్మెను ధ్వంసం చేసింది కాక ఎవరు వస్తారో రండి అంటూ ప్రగల్భాలు పలకడం ఎదుటివారిని రెచ్చగొట్టడం చక్రవర్తి నైజం అని గుర్తు చేశారన్నారీ. దేనికైనా ఓర్పు ఉంటుంది ఓర్పు నశిస్తే నేను చెప్పిన టిడిపి కార్యకర్తలు ఈసారి వినే పరిస్థితి ఉండదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. ధ్వంసం చేసిన చోట దిమ్మెను పునర్నిర్మించామన్నారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం అయితే గుడ్డలు ఊడదీసి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బోడె ప్రసాద్ హెచ్చరించారు.

# రవాణా, రాకపోకలు, సరఫరా వ్యవస్థల్లో ఆర్థిక పరిశోధన కేంద్రం ఏర్పాటుపై ఎన్సీఏఈఆర్‌తో ఎన్‌హెచ్ఏఐ అవగాహన ఒప్పందం

న్యూ ఢిల్లీ, జూన్ 25:రోడ్డు రవాణా రంగంలో స్పష్టమైన ఆధారాలే ప్రాతిపదికగా విధాన రూపకల్పనను బలోపేతం చేయడం, అత్యుత్తమ పరిశోధనలను ప్రోత్సహించే దిశగా.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) కీలక ముందడుగు వేసింది. జాతీయ అనువర్తిత ఆర్థికశాస్త్ర పరిశోధన మండలి (ఎన్సీఏఈఆర్)తో ఎన్‌హెచ్ఏఐ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఎన్సీఏఈఆర్ ప్రాంగణంలో 'ఎన్‌హెచ్ఏఐ రవాణా, రాకపోకలు, సరఫరా వ్యవస్థల్లో ఆర్థిక పరిశోధనల కేంద్రా'న్ని ఏర్పాటు చేయనున్నారు. దేశంలో ఆయా రంగాల్లో ప్రత్యేకంగా పరిశోధనలు చేయడం కోసం ఏర్పాటవుతున్న మొదటి శాశ్వత, స్వతంత్ర పరిశోధన కేంద్రం ఇదే. ఈ కేంద్రం స్థాపనకు ఎన్‌హెచ్ఏఐ ప్రారంభ విరాళాన్ని అందించింది. అలాగే ఇతర అనుబంధ సంస్థలు, భాగస్వాముల నుంచి మరిన్ని నిధులను సమకూర్చడానికి ఎన్సీఏఈఆర్ కట్టుబడి ఉంది.

ఎన్‌హెచ్ఏఐ ప్రధాన కార్యాలయంలో.. ఆ సంస్థ చైర్మన్, ఎన్సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్, ఇరు సంస్థలకు చెందిన ఉన్నతాధికారుల సమక్షంలో ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. పరిశోధనలు, గణాంకాల విశ్లేషణ, రుజువులు ప్రాతిపదికగా నిర్ణయ ప్రక్రియలను... దేశంలో వేగంగా విస్తరిస్తున్న జాతీయ రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణలో భాగం చేయాలన్న ఎన్‌హెచ్ఏఐ అంకిత భావాన్ని ఈ వినూత్న కార్యక్రమం ప్రతిబింబిస్తోంది.

ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ శ్రీ సంతోష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. "దేశీయ రవాణా అనుసంధానాన్నీ, సరఫరా వ్యవస్థల సామర్థ్యాన్నీ పెంపొందించడంలో ఎన్‌హెచ్ఏఐ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటోంది. ఎన్సీఏఈఆర్‌తో కుదిరిన ఈ భాగస్వామ్యం.. అత్యుత్తమ పరిశోధనలు, విధానపరమైన విశ్లేషణల కోసం ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుంది. రవాణా రంగంలో ప్రణాళికలు, పెట్టుబడులు, ఆస్తుల నిర్వహణ నిర్ణయాలను మరింత బలోపేతం చేయడంలో ఇది దోహదపడుతుంది" అని పేర్కొన్నారు.

రోడ్డు, రవాణా రంగంలో దీర్ఘకాలిక ప్రణాళికలు, పెట్టుబడులు, విధాన రూపకల్పనకు అవసరమైన ఆచరణాత్మక విశ్లేషణలను అందించడం లక్ష్యంగా.. రవాణా, రాకపోకలు, సరఫరా వ్యవస్థలపై అనువర్తిత ఆర్థిక పరిశోధనలు చేసే ప్రత్యేక వేదికగా ఈ కేంద్రం సేవలందిస్తుంది. జాతీయ రహదారుల ఆర్థిక వ్యవస్థ, సరుకు రవాణా, వివిధ రవాణా విధానాల అనుసంధానం, జాతీయ రహదారుల్లో పెట్టుబడుల వల్ల ప్రాంతీయ ఆర్థిక వృద్ధిపై చూపే ప్రభావం, టోల్ విధానం, ఆస్తుల నుంచి ద్రవ్యాన్ని సమకూర్చుకోవడం, రహదారి భద్రత చర్యలు, జాతీయ రహదారుల నిర్వహణలో అత్యాధునిక సాంకేతికతను జోడించడం వంటి విస్తృతమైన అంశాలపై ఈ కేంద్రం విధానపరమైన పరిశోధనలు చేస్తుంది. రవాణా వ్యవస్థలో సామర్థ్యాన్నీ, స్థిరత్వాన్నీ పెంచడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన అనుభవాన్ని అందించేలా సరికొత్త విధానాలు, కార్యక్రమాలను రూపొందించడంలో.. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, ఎన్‌హెచ్ఏఐ, ఇతర ప్రభుత్వ సంస్థలకు ఇక్కడి పరిశోధనల ఫలితాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

పరిశోధనలకే పరిమితం కాకుండా.. రవాణా రంగానికి సంబంధించి వైజ్ఞానిక కేంద్రంగానూ ఈ కేంద్రం సేవలందించనుంది. ఇందులో భాగంగా విధాన పత్రాలు, తాత్కాలిక ముసాయిదాలు, ప్రామాణిక నివేదికలు, భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు, వర్క్‌షాపులు, విద్యాసంబంధిత కార్యక్రమాల ద్వారా పరిశోధన ఫలితాలను అందరికీ చేరవేస్తుంది. వీటితోపాటు రవాణా ఆర్థిక రంగంలో భావి నిపుణులను తీర్చిదిద్దడంలోనూ, సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించడంలోనూ ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రముఖ ఆర్థికవేత్తలు, రవాణా రంగ నిపుణులు, ప్రజా విధాన నిపుణులు, విశిష్ట విద్యావేత్తలతోపాటు ఎన్‌హెచ్ఏఐ నుంచి ఒక సభ్యులు (ఆర్థిక), ఎన్సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్లతో కూడిన ఒక సలహా సంఘం ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తుంది. దీనితోపాటు ఎన్‌హెచ్ఏఐ ఏర్పాటు చేసే ఒక స్టీరింగ్ కమిటీ.. ఈ కేంద్రం పరిశోధన ప్రాధాన్యాలను పర్యవేక్షిస్తుంది. అలాగే పరిశోధన ఫలితాలను సమీక్షించడంతోపాటు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ విధానపరమైన, కార్యాచరణ అవసరాలకు అనుగుణంగా ఈ పరిశోధనలు సాగేలా చూస్తుంది. ఈ సంస్థ ఏర్పాటు, నిర్వహణ కోసం పదేళ్ల కాలానికి ఎన్‌హెచ్ఏఐ మద్దతు అందిస్తుంది.

రవాణా మౌలిక సదుపాయాలు, రాకపోకల వ్యవస్థలు, సరఫరా వ్యవస్థల్లో ఆర్థిక కోణాలపై లోతైన అవగాహనను పెంపొందించడం ద్వారా... భవిష్యత్తులో మరింత సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి, విధానాల సమర్థతను పెంచడానికి ఈ సంస్థ తోడ్పడుతుంది. తద్వారా దేశంలో మరింత దృఢమైన, ఆధునిక, ప్రపంచ స్థాయి జాతీయ రహదారి వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతుంది.

## సంస్థాగత బలోపేతానికి మరో ముందడుగు..



మహబూబ్‌నగర్, జూన్ 25: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో బీజేపీ నూతన జిల్లా కార్యాలయంలో గురువారం వాస్తు పూజ, కళ్యాణం, హోమం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్ పోతుగంటి, జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు, జిల్లా కార్యదర్శులు నాగేందర్ గౌడ్, జెట్టి వెంకటేష్, చంద్రరెడ్డి, శ్రీమతి చంద్రకళ, జలాల్, శివుడు, ప్రమోద్, దండు శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, జాకీర్ హుస్సేన్, రవీంద్ర చౌహాన్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్ ప్రసాద్ పోతుగంటి మాట్లాడుతూ, జిల్లా పార్టీ కార్యాలయం భవిష్యత్తులో పార్టీ విస్తరణ కార్యక్రమాలకు కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. సేవ, సుశాసనం, సమర్పణ అనే లక్ష్యాలతో ప్రజలకు మరింత చేరువయ్యే కేంద్రంగా ఈ నూతన కార్యాలయం నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# నీట్ అభ్యర్థులకు అసౌకర్యం కలగొద్దని ప్రధాని వేచి ఉండడం - 'ప్రజలే ప్రథమం'గా పరిపాలనకు నిదర్శనం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 25:'భారత్‌లో వీఐపీ సంస్కృతి: అధికారం, విశేషాధికారాలు, ప్రజాస్వామ్యానికి విఘాతం' అనే పుస్తకాన్ని భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్ ఈ రోజు న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రచయిత, అరుణాచల్ ప్రదేశ్ మాజీ రాజ్యసభ సభ్యుడు శ్రీ నబమ్ రేబియా, సహ రచయిత శ్రీ సందీప్ కుమార్ ఈ పుస్తకంలో విశ్లేషించిన ఈ అంశం.. భారత్ లో ప్రజాస్వామ్య పాలన, ప్రజా జీవితాల మౌలిక స్వరూపాన్ని స్పృశించిందని పేర్కొన్నారు.

న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వ పునాదులపై నిర్మితమైన సమాజాన్నే భారత రాజ్యాంగం ఆకాంక్షిస్తోందని ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించారు. ప్రజలకూ, ప్రజల తరఫున అధికారాన్ని చేపట్టిన వారికీ మధ్య ఉండే సంబంధంపైనే ప్రజాస్వామ్య విజయం ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పదవులను ఒక ప్రత్యేక అధికారంగా కాకుండా, ఒక బాధ్యతగా భావించినప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని ఆయన స్పష్టం చేశారు.

మహోన్నత తమిళ కవి, తిరువళ్లువర్ సూక్తులను ఉటంకిస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉండడం, కరుణ, జవాబుదారీతనం నిజమైన నాయకత్వ లక్షణాలని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి పట్ల గౌరవభావంతో నడచుకునే నాయకులు.. జనం గుండెల్లో చెరగని స్థానాన్నీ, నిరంతర నమ్మకాన్నీ సంపాదించుకుంటారని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ పదవులను ఒక ప్రత్యేక అధికారంగా కాకుండా, ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచన విధానానికి ఈ పుస్తకంలో ప్రస్తావించిన అంశాలు అద్దం పడుతున్నాయని శ్రీ సి. పి. రాధాకృష్ణన్ అన్నారు. ప్రముఖుల వాహనాలకు ఉండే ఎర్ర బుగ్గలను తొలగిస్తూ ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయాన్నీ, అలాగే ఇటీవల నీట్ అభ్యర్థులకు ట్రాఫిక్ ఆంక్షల వల్ల ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో ఆయన కొద్దిసేపు వేచి ఉన్న విషయాన్నీ ఉపరాష్ట్రపతి గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ప్రజలే కేంద్రంగా సాగే పాలనకు నిదర్శనాలన్న ఆయన.. ప్రభుత్వ అధికారం ప్రజల సేవ కోసమేనన్న సూత్రాన్ని ఇవి మరింత బలపరుస్తాయన్నారు. "ప్రతి భారతీయుడూ ప్రత్యేకమైనవారే. ప్రతి భారతీయుడూ వీఐపీనే" అన్న ప్రధానమంత్రి మాటలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. "సేవే పరమ ధర్మం" అని ఉపరాష్ట్రపతి అన్నారు. మాజీ ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి, ఇతర ప్రముఖుల నిరాడంబరతనూ, ప్రజా సేవా దృక్పథాన్నీ ఈ పుస్తకంలో ప్రస్తావించిన తీరును ఉపరాష్ట్రపతి అభినందించారు. ఉపనిషత్తులు, రామచరితమానస్, గౌతమ బుద్ధుడి బోధనలు, పంచతంత్రం వంటి భారత సాంస్కృతిక, మేధోపరమైన సంప్రదాయాలను ప్రస్తావిస్తూ.. రచయితలు తమ విశ్లేషణను మరింత సుసంపన్నం చేశారని ఆయన పేర్కొన్నారు. భారత గణతంత్రానికి దిక్సూచిగా నిలిచే విలువలకు ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. చట్టం ముందు అందరూ సమానులేననీ, ప్రతి పౌరుడి గౌరవాన్ని కాపాడాలనీ స్పష్టం చేశారు. వినమ్రత, బాధ్యతాయుతమైన ప్రజా సేవ అత్యావశ్యకమన్నారు. ప్రజల్లో నమ్మకం, ప్రజాసేవలే నాయకత్వానికి అసలైన కొలమానాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ నబామ్ టుకీ, మేఘాలయ మాజీ రాజ్యసభ సభ్యుడు శ్రీ డబ్ల్యూ. ఆర్. ఖార్లుఖి, రచయిత శ్రీ నబామ్ రేబియా, సహ రచయిత శ్రీ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

# జాతీయ ఏకతను పెంపొందించడానికి దేశమంతటా 'వందే మాతరం శిబిరాలు' నిర్వహించనున్న మై భారత్

న్యూ ఢిల్లీ, జూన్ 25:దేశ వ్యాప్తంగా వందే మాతరం శిబిరాలను కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన యువజన వ్యవహారాల విభాగం 'మై భారత్' (ఓజ ః ష్ట్రజీతీజీబి) సహకారంతో నిర్వహించనుంది. మొదటి శిబిరాన్ని బంకిమ్ చంద్ర చటర్జీ జయంతి సందర్భంగా 2026 జూన్ 24నుంచి 30 వరకు కోల్‌కతాలో ఏర్పాటు చేయనున్నారు. జాతీయ ఏకత, రాజ్యాంగ విలువలతో పాటు యువజన నాయకత్వాన్ని పటిష్ఠపరిచే ఉద్దేశంతో చేపడుతున్న ప్రధాన యువజన సమీకరణ కార్యక్రమమిది.

ఏడు రోజుల పాటు కొనసాగించే ఈ శిబిరాల్లో భారత రాజ్యాంగ, ప్రజాస్వామిక సంప్రదాయాల పట్ల యువజనుల్లో అవగాహనను విస్తృతం చేసే అవకాశాలను అందిస్తారు. సాంస్కృతిక ఆత్మవిశ్వాసాన్ని, పౌర బాధ్యతను పెంపొందింపచేస్తారు. 2047 కల్లా 'వికసిత్ భారత్' దిశగా అడుగులు వేసేటట్లు విషయాలపై అవగాహనను పెంచుకొనే, బాధ్యత కలిగి నడుచుకొనే, దేశానికి పనికివచ్చే యువ నాయకుల తరాన్ని పెంచి పోషించడమే ఈ శిబిరాల ప్రధానోద్దేశం.

మాతృభూమి పట్ల గౌరవభావనను ప్రోత్సహిస్తూ ప్రాంతీయ, భాషా, సామాజిక సరిహద్దులకు అతీతంగా భావనాత్మక ఏకీకరణకు ప్రతీకగా 'వందే మాతరం' నిలిచింది. 'వందే మాతరం' భావన నుంచి స్ఫూర్తిని వందే మాతరం శిబిరాలు తీసుకుంటున్నాయి. ఈ కార్యక్రమం పౌరుల భాగస్వామ్యాన్ని, నాయకత్వాన్ని తీర్చిదిద్దడం, డిజిటల్ మాధ్యమాల వినియోగంపై పట్టును పెంపొందించడం, సామాజిక బాధ్యతలతో పాటు ఉమ్మడి భాతస్వామ్యాన్ని కూడా పెంచి సమకాలీన యువత సమస్యలకు పరిష్కారాలను అందించదలుస్తోంది.

ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన జిల్లాల్లో 20 శిబిరాలను ఏర్పాటు చేస్తారు. వాటిలో ప్రతి శిబిరంలో 15 ఏళ్లు- 29 ఏళ్ల వయసున్న 150 మంది యువతను తీసుకుంటారు. ప్రతి శిబిరంలో 6 రాష్ట్రాల ప్రతినిధులు ఉంటారు. ఈశాన్య ప్రాంత రాష్ట్రాలకు తప్పనిసరిగా ప్రాతినిధ్యాన్ని కల్పిస్తారు. మహిళలు, సామాజికంగా మోసానికి గురైన వర్గాలకు కనీసం 50 శాతం భాగస్వామ్యం ఉంటుంది. ఈ శిబిరాల్లో దాదాపు 3,000 యువతను చేర్చుకుంటారు. రాజ్యాంగ విలువలు, సాంస్కృతిక మార్పిడి మొదలు నాయకత్వాన్ని తీర్చిదిద్దడం, ప్రధాన పథకాల వరకూ అనేక అంశాలను ఈ శిబిరాల్లో ప్రస్తావిస్తారు.

వారం పొడవునా సాగే శిబిరాల్లో.. వందే మాతరానికి ఉన్న చరిత్రాత్మక ప్రాధాన్యాన్ని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం పోషించిన పాత్రను వివరిస్తారు. రాజ్యాంగం, పౌరుల కర్తవ్యాలకు సంబంధించిన కార్యక్రమాలు, భాష, భోజనం, క్రీడల మాధ్యమాల ద్వారా సాంస్కృతిక ఆదాన, ప్రదానం, చరిత్రాత్మక ప్రాధాన్యం కలిగిన ప్రదేశాల్లో పర్యటనలు, 'దేశమే ప్రథమం' అంశంపై చర్చలు ఉంటాయి. తాత్కాలిక ఉపన్యాస కార్యక్రమాలు, నాయకత్వం, ప్రజాసమీకరణ వర్క్‌షాపులతో పాటు ప్రభుత్వ ప్రధాన పథకాలపై కూడా చర్చలు చోటుచేసుకొంటాయి.

భారత యువత శక్తిని, ఆదర్శవాదాన్ని, సృజనాత్మకతను ఉపయోగించుకొంటూ ఏకత, రాజ్యాంగ విలువలతో పాటు దేశాన్ని తీర్చిదిద్దాలన్న ఆదర్శాల్ని ప్రోత్సహించడానికి మంత్రిత్వ శాఖ ఎంతగా నిబద్ధమై ఉన్నదీ వందే మాతరం శిబిరాలు పునరుద్ఘాటిస్తాయి.

## ఎస్ఐఆర్‌కు సహకారం అందించాలి

**-గ్రామస్తులకు రామచంద్రపురం సర్పంచ్ నర్సింహులు పిలుపు**



మహబూబ్‌నగర్, జూన్ 25: మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వై. నర్సింహులు గ్రామస్తులకు ఎస్ఐఆర్ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఓటరు జాబితాను సమగ్రంగా సవరించే ప్రక్రియ చేపట్టారని, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించి, 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లకు నమోదు చేసే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంజీవరెడ్డి, జీపీవో సైదమ్మ, బీఎల్ఓ పుష్పలత, బీఎల్ఏలు బి. వీరన్న, ఎండి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలి

**-డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరం కృషి చేద్దాం : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**

**-ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం -మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం : జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**




సంగారెడ్డి, జూన్ 25 (నేటి నిజం ప్రతినిధి) ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఓటు హక్కు ఎంత కీలకమో, యువత భవిష్యత్తు కోసం మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కూడా అంతే ముఖ్యమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు.

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)పై ప్రజల్లో అవగాహన కల్పించడం, అలాగే మాదకద్రవ్యాల నిర్మూలనపై చైతన్యం తీసుకురావడం లక్ష్యంగా గురువారం జిల్లా కలెక్టరేట్ నుంచి ఐబీ గెస్ట్ హౌస్ వరకు నిర్వహించిన 2కె రన్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ప్రజాస్వామ్య బాధ్యత అని అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని, అలాగే చిరునామా మార్పులు, పేరు సవరణలు, ఇతర వివరాల నవీకరణ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధమని పేర్కొన్న కలెక్టర్, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. జూన్ 25 నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రజలు సరైన వివరాలను అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అదేవిధంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం సమాజానికి, ముఖ్యంగా యువతకు తీవ్ర ముప్పుగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా యువత తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసు శాఖకు ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

యువత చెడు అలవాట్ల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

డ్రగ్స్‌కు 'నో' చెప్పి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, సాంస్కృతిక సారథి కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బొగ్గు గ్యాసిఫికేషన్‌పై దృష్టి సారిస్తూ స్వచ్ఛ బొగ్గు సాంకేతికతలపై బ్రిక్స్ అనుబంధ కార్యక్రమాన్ని నిర్వహించిన బొగ్గు మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, జూన్ 25:బొగ్గు గ్యాసిఫికేషన్‌పై దృష్టి సారిస్తూ స్వచ్ఛ బొగ్గు సాంకేతికతలపై బ్రిక్స్ అనుబంధ కార్యక్రమాన్ని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, సాంకేతిక నిపుణులతో పాటు రష్యా, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాల బ్రిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సనోజ్ కుమార్ ఝా ప్రసంగిస్తూ.. భారతదేశ ఇంధన భద్రతను బలోపేతం చేయటంలో, పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వటంలో బొగ్గు గ్యాసిఫికేషన్ కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. కోల్ గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గును సిన్ గ్యాస్‌గా మార్చవచ్చని.. దీని ద్వారా అమ్మోనియా, మిథనాల్, హైడ్రోజన్, సింథటిక్ ఇంధనాలు, డీఆర్ఐ, ఇతర విలువైన ఉత్పత్తులను తయారు చేయవచ్చని తెలిపారు. ఈ సాంకేతికత దేశీయ బొగ్గు వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవటానికి తోడ్పడమే కాక, దిగుమతుల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విధానపరమైన మద్దతు, ఆర్థిక ప్రోత్సాహకాలు, ఖచ్చితమైన బొగ్గు సరఫరా వ్యవస్థలు, వివిధ మంత్రిత్వ శాఖల సమన్వయ ప్రయత్నాల ద్వారా 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ చేపట్టటమే భారత ప్రభుత్వ లక్ష్యమని శ్రీ సనోజ్ కుమార్ ఝా వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. స్వచ్ఛ బొగ్గు సాంకేతికతలను మరింత ముందుకు తీసుకెళ్లటంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం అవసరమని స్పష్టం చేశారు.

ఈ కార్యశాల సందర్భంగా కోల్ గ్యాసిఫికేషన్ సాంకేతికతపై బీహెచ్ఈఎల్.. కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులు, ఈ సాంకేతికత బ్రిక్స్ దేశాలకు ఎంత ముఖ్యమో తెలిపేలా జిందాల్ స్టీల్ (జేఎస్ఎల్), గ్రేటా ఎనర్జీ సంస్థలు ప్రజెంటేషన్ ఇచ్చాయి. కస్తా అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ (యూసీజీ) ప్రాజెక్టు గురించి ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఈసీఎల్) వివరించింది. యూసీజీకి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, బొగ్గు గనుల కేటాయింపుల గురించి నామినేటెడ్ అథారిటీ తెలిపింది. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) అందిస్తున్న బొగ్గు సరఫరా సదుపాయాలను, ఆ సంస్థ చేపట్టనున్న నూతన ప్రాజెక్టుల వివరాలను తెలియజేసింది.

కోల్ గ్యాసిఫికేషన్‌కు సంబంధించి వివిధ అంశాలపై చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా సాంకేతికత, ప్రాజెక్టుల ఆర్థిక వివరాలు, భౌగోళికంగానే కాక, గ్యాసిఫికేషన్ ప్రక్రియలోని సవాళ్లు, భారతదేశంలోని బొగ్గులో ఉండే అధిక శాతం ఫ్లైయాష్‌ను వినియోగించుకోవటం, సాంకేతికతను విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రభుత్వ విధానాలు, ఆర్థిక సహాయం వంటి పలు కీలక అంశాలపై చర్చించారు.

## నానీలు

మరో బ్యాంకు
బోర్డు తిప్పేసిందా?
మరి అత్యేశగా
కొంప ముంచింది.

– డా॥ చిల్లర భవాని

# మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట అనివార్యం

**జూన్ 26...అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం**




సమస్యలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం ఒకటి. వ్యక్తిగత జీవితాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా కుటుంబ వ్యవస్థలను, సామాజిక సంబంధాలను, దేశాల ఆర్థిక వ్యవస్థలను సైతం దెబ్బతీస్తున్న ఈ దురాచారాన్ని అరికట్టేందుకు ప్రపంచ దేశాలు నిరంతరం పోరాడుతున్నాయి. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, వ్యాపారాన్ని నిరోధించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1987 డిసెంబర్ 7న ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఆమోదించిన తీర్మానం 42/112 ప్రకారం ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల ముప్పు నుండి రక్షించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి మాదక ద్రవ్యాలు మరియు నేరాల కార్యాలయం అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది.

మానవ చరిత్రలో మత్తు పదార్థాల వినియోగం కొత్తది కాదు. వేలాది సంవత్సరాలుగా కొన్ని మొక్కలు, పదార్థాలు ఔషధ అవసరాలకు, కొన్ని సాంప్రదాయ ఆచారాలకు ఉపయోగించబడుతున్నాయి. అయితే ఆధునిక కాలంలో వీటి వినియోగం వైద్య అవసరాలను దాటి వ్యసనంగా మారడం సమస్యకు మూల కారణమైంది. ముఖ్యంగా ఇరవయ్యో శతాబ్దం ద్వితీయార్థం నుండి హెరాయిన్, కొకైన్, ఎల్ఎస్డీ, సింథటిక్ డ్రగ్స్, మెథాంఫెటమైన్ వంటి రసాయనిక మాదక ద్రవ్యాల వ్యాప్తి ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేసింది. నేడు డ్రగ్స్ అక్రమ రవాణా అంతర్జాతీయ నేర ముఠాలకు కోట్లాది డాలర్ల ఆదాయ వనరుగా మారింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఏదో ఒక రూపంలో మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నారు. యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ విడుదల చేసిన వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం ప్రపంచంలో సుమారు 29 కోట్ల మందికి పైగా మాదక ద్రవ్యాలను వినియోగించిన అనుభవం ఉంది. వీరిలో కోట్లాది మంది వ్యసన రుగ్మతలతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది మాదక ద్రవ్యాల కారణంగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రాణాలు కోల్పోతున్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, హింసాత్మక సంఘటనలు, నేరాలు, ఆత్మహత్యలు ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయి.

భారతదేశంలో కూడా మాదక ద్రవ్యాల సమస్య క్రమంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు సరిహద్దు ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఈ సమస్య ఇప్పుడు పట్టణాలు, చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. ముఖ్యంగా యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఇరవై నుంచి ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు గురయ్యే వారు ఇప్పుడు పదిహేను నుంచి పదిహేడేళ్ల వయస్సులోనే మాదక ద్రవ్యాల బారిన పడుతున్నట్లు అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృత్తి నిపుణులు కూడా ఈ వ్యసనానికి బలవుతున్నారు.

మాదక ద్రవ్యాలు మనిషి మెదడు పనితీరుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. మెదడులో డోపమైన్, ఎండార్ఫిన్స్ వంటి రసాయనాల విడుదలను అసహజంగా పెంచడం ద్వారా తాత్కాలిక ఆనందాన్ని కలిగిస్తాయి. అయితే కొంతకాలం తర్వాత సహజసిద్ధమైన ఆనందాన్ని పొందే సామర్థ్యం తగ్గిపోతుంది. ఫలితంగా అదే మత్తును పొందేందుకు మరింత ఎక్కువ మోతాదులో మాదక ద్రవ్యాలను వినియోగించాల్సి వస్తుంది. ఈ పరిస్థితి వ్యసనానికి దారితీస్తుంది. ఒకసారి బానిసగా మారిన తర్వాత మాదక ద్రవ్యాలు లభించని సందర్భంలో తీవ్ర ఆందోళన, చిరాకు, నిరాశ, నిద్రలేమి, శారీరక బలహీనత, మానసిక అస్థిరత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు కేవలం వ్యక్తికే పరిమితం కావు. కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. వ్యసనానికి బానిసైన వ్యక్తులు కుటుంబ సభ్యులతో ఘర్షణలకు దిగడం, ఆర్థిక వనరులను వృథా చేయడం, కుటుంబ బంధాలను దెబ్బతీయడం సాధారణంగా కనిపించే అంశాలు. అనేక కుటుంబాలు అప్పులపాలవడం, విడాకులు, కుటుంబ విచ్ఛిన్నాలు, గృహ హింస వంటి సమస్యలకు గురవుతున్నాయి. సమాజంలో నేరాల పెరుగుదలకు కూడా మాదక ద్రవ్యాలు ప్రధాన కారణాలలో ఒకటిగా నిలుస్తున్నాయి.

యువతలో మాదక ద్రవ్యాల వినియోగానికి అనేక కారణాలు ఉన్నాయి. స్నేహితుల ప్రభావం, కొత్త అనుభవాల పట్ల కుతూహలం, చదువుల ఒత్తిడి, ఉద్యోగ పోటీ, కుటుంబ కలహాలు, మానసిక ఆందోళనలు, నిరుద్యోగం, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలు యువతను ఈ దురలవాట్ల వైపు నెడుతున్నాయి. కొందరు తమ సమస్యలను మరచిపోవడానికి, మరికొందరు ఫ్యాషన్‌గా భావించి, ఇంకొందరు సాహసంగా భావించి మాదక ద్రవ్యాలను ఆశ్రయిస్తున్నారు. కానీ తాత్కాలిక ఆనందం కోసం ప్రారంభమైన అలవాటు జీవితాంతం వెంటాడే శాపంగా మారుతోంది.

భారతదేశంలో గంజాయి, చరస్, హెరాయిన్, బ్రౌన్ షుగర్, కొకైన్, మార్ఫిన్, మెథాంఫెటమైన్, ఎల్ఎస్డీ వంటి మాదక ద్రవ్యాలు వివిధ రూపాల్లో చలామణిలో ఉన్నాయి. ఇటీవల సింథటిక్ డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ డ్రగ్ ముఠాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కొత్త మార్గాల్లో అక్రమ రవాణా నిర్వహిస్తున్నాయి. సరిహద్దులు, సముద్ర మార్గాలు, ఆన్‌లైన్ వేదికలు కూడా డ్రగ్స్ వ్యాపారానికి వినియోగించబడుతున్నాయి.

ఈ సమస్యను ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టాన్ని అమలు చేస్తోంది. ఈ చట్టం ప్రకారం మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, నిల్వ, వినియోగం వంటి చర్యలు కఠిన శిక్షార్హమైన నేరాలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, పోలీసు శాఖలు, కస్టమ్స్ విభాగాలు, ఇతర దర్యాప్తు సంస్థల ద్వారా అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. అయినప్పటికీ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు.

మాదక ద్రవ్యాల నిర్మూలనలో చట్టాల కంటే అవగాహన మరింత కీలకం. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు మాదక ద్రవ్యాల ప్రమాదాలపై నిరంతర అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. సమాజంలోని ప్రతి వర్గం ఈ సమస్యను కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ముఖ్యంగా వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణించి వారికి వైద్య చికిత్స, మానసిక సలహా, పునరావాస సేవలు అందించాలి.

జూన్ 26 అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు; సమాజాన్ని అప్రమత్తం చేసే హెచ్చరిక కూడా. మాదక ద్రవ్యాలు ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి, కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయి, యువత భవిష్యత్తును చీకటిలోకి నెడతాయి, దేశ ప్రగతికి అడ్డంకిగా మారతాయి. అందువల్ల ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, కుటుంబాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా, పౌర సమాజం సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలి. వ్యసన రహిత యువత, ఆరోగ్యవంతమైన కుటుంబాలు, సురక్షిత సమాజం, సుసంపన్న దేశం అనే లక్ష్యాన్ని సాధించాలంటే మాదక ద్రవ్యాలపై పోరాటాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాల్సిన అవసరం ఉంది.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## నానీలు

బొంబాయి బస్సు
మనుషులతో పాటు
రోజూ కన్నీటి నదుల్ని
మోసుకెళ్తుంది.

– డా॥పత్తిపాక మోహన్

# పేదల గడపల్లో 'ఇందిరమ్మ' ఆనందం

**–టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**
**–ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం**
**–ప్రతి నిరుపేద కుటుంబానికి గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం**



సంగారెడ్డి, జూన్ 24:రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా ముందుకు సాగుతోందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి మున్సిపాలిటీ 29వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, గృహాన్ని పరిశీలించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం తమకు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా లక్షలాది మంది నిరుపేదలు శాశ్వత నివాసాన్ని పొందుతున్నారని పేర్కొన్నారు. ఇంకా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోని అర్హులైన పేద కుటుంబాలు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పొందాలని ఆమె సూచించారు. ప్రతి అర్హ కుటుంబానికి సొంతింటి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కౌన్సిలర్ సంగీతా మహేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి

**–టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**




సంగారెడ్డి, జూన్ 24:ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓట్లను తొలగించేందుకు జరుగుతున్న కుట్రలను అడ్డుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన 282 మంది బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), ఇంచార్జ్‌లు, ముఖ్య నాయకులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ఓటర్ల సవరణ కార్యక్రమంలో ప్రతి నాయకుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల హక్కులను పరిరక్షించడం, వారికి అవసరమైన సహకారం అందించడం పార్టీ నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు.

"సర్" ప్రక్రియ ముగిసే వరకు నాలుగు దఫాలుగా సమావేశాలు నిర్వహిస్తామని, జూలై 6న మరో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితులను లోతుగా చర్చిస్తామని తెలిపారు. ప్రతి సమావేశానికి బీఎల్ఏలు, ఇంచార్జ్‌లు, గెలిచిన, ఓడిన సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. 282 మంది బీఎల్ఏలు, ఇంచార్జ్‌లు పూర్తిస్థాయిలో సమయం కేటాయించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పర్యవేక్షించాలని కోరారు.

వారికి అందజేసిన గుర్తింపు కార్డులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఓటర్ల తొలగింపుల కారణంగా ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడిందని ఆరోపించారు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచనల మేరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, ప్రజల ఆశయాలకు అనుగుణమైన పాలన కోసం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, పార్లమెంట్ ఇంచార్జ్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, చెనగాని దయాకర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోబాజీ అనంత కిషన్, సంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 28న 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి.

**-జూన్ 28న బూత్‌లలో, 29-30 తేదీల్లో ఇంటింటి సర్వే ద్వారా పోలియో చుక్కలు.**
**-జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి – జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

సంగారెడ్డి, జూన్ 25(నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో జాతీయ టీకా కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

జిల్లాలో మొత్తం 1,80,405 మంది ఐదేళ్లలోపు చిన్నారులను పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా కవర్ చేయడానికి లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జూన్ 28న 1137 పోలియో బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేస్తారని , 28న పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని వెల్లడించారు.

దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించేందుకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో బూత్‌కు తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

జూన్ 28న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పల్స్ పోలియో బూత్‌లకు తమ ఐదేళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ తల్లిదండ్రులకు సూచించారు.

పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

**–చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్**

యాదాద్రి భువనగిరి జిల్లా, జూన్ 25: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల (డ్రగ్స్) వంటి అలవాట్లకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని చౌటుప్పల్ పోలీస్ ఇన్స్పెక్టర్ జి.మన్మథ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం చౌటుప్పల్ మండలం లోని దేవలమ్మ నాగారం ప్రభుత్వ విద్యాసంస్థలో విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మన్మథ కుమార్ మాట్లాడుతూమాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, కన్నవారి కలలు, చదువు, భవిష్యత్తు పూర్తిగా నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకూడదని, ఎవరైనా డ్రగ్స్ వాడాలని ఒత్తిడి చేసినా లేదా విక్రయించడానికి ప్రయత్నించినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా వచ్చే తప్పుడు ప్రలోభాలకు లోనుకాకుండా, మంచి స్నేహితులను ఎంచుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కోరారు.

కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామ్యం అవుతామంటూ విద్యార్థులందరితో సీఐ ప్రతిజ్ఞ చేయించారు. "నేను మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయుచున్నాను జైహింద్" అని విద్యార్థులు ముక్తకంఠంతో నినదించారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కనకటి యాదగిరి, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యాసంస్థల యాజమాన్యం, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పరకాలలో ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమం..



వరంగల్, జూన్ 25: పరకాల పట్టణంలోని 40వ బూత్ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల తహసీల్దార్ తోట విజయలక్ష్మి హాజరై ఓటర్లకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ అధికారి ఎస్డీ షకీర్, బూత్ లెవెల్ అధికారి అల్లం సాంబయ్య ఓటరు వివరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా బీజేపీ బీఎల్ఏ ప్రతినిధి, పురపాలక సంఘం 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్ పాల్గొని ఓటర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపు వంటి ఫారం-6, ఫారం-7, ఫారం-8లను అక్కడికక్కడే స్వీకరించారు.

కొత్తగా 18 ఏళ్లు నిండిన వారు, పేరు మిస్ అయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తోట విజయలక్ష్మి సూచించారు.

# ఓటరు జాబితాను పారదర్శకంగా నిర్వహించాలి..

వరంగల్, జూన్ 25: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్క ఓటరుకు అవకాశం కల్పించాలని మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట తహసీల్దార్ రమేష్‌బాబు బీఎల్‌వోలను ఆదేశించారు. మండల కేంద్రంలో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని, ఓటరు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలపై బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. రెండు దశాబ్దాల తర్వాత ఓటరు జాబితాను సమగ్రంగా సవరించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్న తహసీల్దార్, ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని, ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.